రూ.7.51 కోట్లతో హాస్టళ్లకు మరమ్మతులు

- పదో తరగతిలో 100 శాతం ఉత్తీర్ణతే లక్ష్యం
- సాంఘిక సంక్షేమ శాఖ డీడీ సరస్వతి



ఇంటర్వ్యూ

కడప ఎన్టీఆర్‌సర్కిల్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని వసతి గృహాల మరమ్మతులకు రూ.7.51 కోట్ల నిధులు ప్రభుత్వం మంజూరు చేసిందని సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ కె.సరస్వతి పేర్కొన్నారు. అంతేకాకుండా కాస్మెటిక్ చార్జీలు, మెస్ చార్జీలు ఇప్పటివరకు ఎలాంటి బకాయిలు లేకుండా చెల్లించామన్నారు. అదేవిధంగా విద్యార్థులకు అవసరమైన బెడ్‌షీట్లు, దుప్పట్లు, ప్లేట్లు, గ్లాసులు, ట్రంకుపెట్టెలు అందజేశామన్నారు. ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూలో ఆమె పలు విషయాలు వెల్లడించారు.

ప్రశ్న: జిల్లాలో మొత్తం ఎన్ని వసతిగృహాలు ఉన్నాయి

జవాబు: సాంఘిక సంక్షేమ శాఖ పరిధిలో మొత్తం 67 వసతిగృహాలు ఉన్నాయి. అందులో 60 వసతిగృహాలకు ప్రభుత్వ భవనాలు ఉన్నాయి. మరో ఏడు గృహాలు ప్రైవేటు భవనాల్లో నిర్వహిస్తున్నాం. వీటిలో 53 పాఠశాల వసతి గృహాలు కాగా 14 కళాశాల వసతి గృహాలు ఉన్నాయి. వీటిలో కూడా 40 బాలురకు, 27 బాలికలకు నిర్వహిస్తున్నాం.

ప్రశ్న: ఎంతమంది విద్యార్థులు వసతి పొందుతున్నారు?

జవాబు: ప్రీమెట్రిక్ వసతి గృహాలలో 5,472 మంది విద్యార్థులకు వసతి కల్పించాం. పోస్ట్‌మెట్రిక్ వసతిగృహాల్లో మొత్తం 1,785 మంది విద్యార్థులకు వసతి కల్పించాం. ప్రీమెట్రిక్ వసతి గృహంలో ప్రతి విద్యార్థికి స్టీల్‌ప్లేటు, స్టీల్ గ్లాసు, ట్రంకుపెట్టె, దుప్పటి, కార్పెట్, నోటుపుస్తకాలు ఇచ్చాము. వీటితో పాటు డైట్ చార్జీలకు గాను రూ.4.14 కోట్లు ఖర్చు చేశాం. కాస్మెటిక్ చార్జీలకు గాను రూ.70.12 లక్షలు మంజూరు చేశాం.

ప్రశ్న: పదోతరగతిలో ఉత్తీర్ణత శాతాన్ని పెంచేందుకు తీసుకుంటున్న చర్యలు..

జవాబు: గత విద్యాసంవత్సరంలో 10వ తరగతి విద్యార్థులు 491 మంది పరీక్షలకు హాజరుకాగా 486 మంది ఉత్తీర్ణత సాధించారు. కేవలం ఐదుగురు మాత్రమే ఫెయిల్ అయ్యారు. 98.98 ఉత్తీర్ణత శాతాన్ని సాధించాం. ఈ ఏడాది వందశాతం ఉత్తీర్ణత సాధించేందుకు కృషి చేస్తున్నాం. పాఠశాలలో ప్రత్యేక తరగతులే కాకుండా వసతిగృహాల్లో కూడా నాలుగు ముఖ్యమైన సబ్జెక్టులకు ట్యూటర్లను నియమించి 10వ తరగతి పరీక్షల్లో ప్రతిభ చాటేలా చర్యలు తీసుకుంటున్నాం.

ప్రశ్న: మౌలిక వసతుల కల్పనకు తీసుకుంటున్న చర్యలు..

జవాబు: వసతి గృహాల్లో మౌలిక వసతుల కల్పన కోసం ప్రత్యేక చొరవ తీసుకుంటున్నాం. కొన్ని వసతి గృహాల్లో చిన్నపాటి మరమ్మతులు చేయాల్సిన అవసరం ఉంది. ఈ మేరకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాము. ప్రభుత్వం రూ.7.51 కోట్లు నిధులు విడుదల చేసింది.

ప్రశ్న: పనులు ఎప్పుడు మొదలు పెట్టనున్నారు

జవాబు: కన్‌స్ట్రక్షన్ ఏజెన్సీలను కలెక్టర్ ఎంపిక చేయాల్సి ఉంటుంది. అది పూర్తికాగానే టెండర్లు పిలిచి పనులు మొదలుపెడతాం. ఈ ప్రక్రియ అంతా ఈ విద్యా సంవత్సరం చివరి నాటికి పూర్తికావాల్సి ఉంది. మార్చి నాటికే పూర్తి చేయాలనే లక్ష్యంతో ఉన్నాం.

టిడ్కో ఇళ్లు ఇచ్చేదెన్నడు..?



- చంద్రబాబుకు పేరు రాకూడదని..
- నాడు పట్టించుకోని జగన్
- అధికారంలోకి వచ్చి ఏడు నెలలైనా..
- స్పందించని కూటమి నేతలు
- అద్దెలు కట్టలేక పేద, మధ్యతరగతి వారి అగచాట్లు

(కడప-ఆంధ్రజ్యోతి): వైసీపీ అధినేత, మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి.. చంద్రబాబు పాలన గుర్తులు ఉండకూడదనే దురుద్దేశ్యంతో పాలన సాగించాడంటారు. ఉమ్మడి రాష్ట్రంలో జగన్ సీఎం కాక మునుపు ఏ పార్టీ అధికారంలో ఉన్నా పేద, మధ్య తరగతి _కి సంబంధించిన అభివృద్ధి కార్యక్రమాలను కొనసాగించేవారు. దీనికి భిన్నంగా జగన్ వ్యవహరించారు. 2014-2019 కాలంలో పేదల కోసం అప్పటి టీడీపీ ప్రభుత్వం పట్టణాల్లో నిర్మించిన టిడ్కో ఇళ్లను పేదలకు ఇవ్వకుండా పక్కన పెట్టేశారు. 2019 ఎన్నికల నాటికి అంటే మార్చి నెలకు ముందు టిడ్కో ఇళ్ల నిర్మాణం దాదాపు 80 శాతం పూర్తయ్యాయి. కేవలం ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అయిన తాగునీరు, విద్యుత్, రోడ్లు, పార్కు, మురుగునీరు, మురుగుకాల్వలు మాత్రమే నిర్మించాల్సి ఉంది. అంతలోనే ఎన్నికలు రావడంతో ఆ పనులు ఆగిపోయాయి. ఇక జగన్ సీఎం అయిన తరువాత చంద్రబాబు మార్కు, అభివృద్ధి ఉండకూడదన్న లక్ష్యంతో ఆయన చేపట్టిన పనులన్నీ మడిచి మడతపెట్టేశారు. పనులు 25 శాతం పూర్తికాని వాటిని రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. ఆ పై స్థాయిలో జరిగిన పనులను కొనసాగిస్తామని చెప్పుకొచ్చారు. మిగతా అభివృద్ధి పనులు వదిలేస్తే 80 శాతం పూర్తయిన టిడ్కో ఇళ్లను కూడా జగన్ పట్టించుకోలేదు. వాటిలో మౌలిక వసతులు కల్పించి అర్హులైన వారికి ఇవ్వకుండా కేవలం చంద్రబాబుకు పేరు వస్తుందనే దురుద్దేశ్యంతో టిడ్కో ఇళ్లను గాలికి వదిలేశారంటారు. ఇక మళ్లీ చంద్రబాబు పాలన రావడంతో ఇళ్లు అందుతాయనే ఆశించిన లబ్ధిదారులకు ఏడు నెలలు దాటినా అందకపోవడంతో అద్దె ఇళ్లల్లో మగ్గుతూ ప్రభుత్వంపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలో 2014-2019 చంద్రబాబు ప్రభుత్వం హయాంలో కడప, ఎర్రగుంట్ల, జమ్మలమడుగులో మొదటి దశలో టిడ్కో ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. ఇందులో పేదలు, మధ్యతరగతి కుటుంబాలకు ఇళ్లు కట్టించింది. 300 చదరపు అడుగులు, 365, 430 చదరపు అడుగులతో నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. 300 చదరపు అడుగుల ఇళ్లకు లబ్ధిదారుని వాటా రూ.500 కాగా, 365కు రూ.50వేలు, 430 చదరపు అడుగులు (డబుల్ బెడ్‌రూం)కు రూ.లక్ష చెల్లించాలని నిర్ణయించింది. దీనిని ఇన్‌స్టాల్‌మెంట్లలో చెల్లించవచ్చు. మొదటగా కడప రిమ్స్ సమీపంలో 992 ఇళ్లు, ఎర్రగుంట్లలో 1,584, జమ్మలమడుగులో 1,440 ఇళ్లను అపార్ట్‌మెంటు తరహాలో నిర్మాణం చేపట్టారు. కడపలో 300 చదరపు అడుగుల్లో 480 ఇళ్లు, 365లో 128, 430లో 384, ఎర్రగుంట్లలో 300 చదరపు అడుగుల్లో 576, 365లో 720, 430లో 140 ఇళ్ల నిర్మాణం చేపట్టారు. కడప, ఎర్రగుంట్లలో నిర్మించిన ఇళ్లల్లో మొత్తం పూర్తయ్యాయి. జమ్మలమడుగులో చేపట్టిన 1,440 ఇళ్లల్లో ఇంకా పెండింగులో ఉన్నాయి. దాదాపు 36 గృహాలు ఇంకా నిర్మాణం పూర్తి కాలేదు. 2019లో టీడీపీ ప్రభుత్వం దిగిపోయింది. వైసీపీ ప్రభుత్వం వచ్చింది. ఐదేళ్లు వైసీపీ అధికారంలో ఉంది. ఆ సమయంలో మౌలిక వసతులు కల్పించి ఆ ఇళ్లు లబ్ధిదారులకు ఇచ్చి ఉంటే ఆ ప్రాంతం బాగా అభివృద్ధి చెందేది. అయితే కేవలం చంద్రబాబు మీద కక్షతో వదిలేశారు.

కూటమి ప్రభుత్వం మీదే ఆశలు

అధికారంలోకి వస్తే టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు ఇస్తామని సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ చెప్పుకొచ్చారు. కూటమి ప్రభుత్వం వచ్చి ఏడు నెలలు దాటింది. వాటిని ఇంకా లబ్ధిదారులకు ఇవ్వకపోవడంతో పేద, మధ్యతరగతి కుటుంబాల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది. ఈ ఇళ్లు పూర్తయితే చంద్రబాబుకు క్రెడిట్ వస్తుందనే జగన్ ప్రభుత్వం వదిలేసింది. కూటమి ప్రభుత్వం కూడా ఎందుకు పట్టించుకోవడం లేదని లబ్ధిదారులు ప్రశ్నిస్తున్నారు.

పేదలు, మధ్యతరగతి వారికోసం 2014-2019లో చంద్రబాబు ప్రభుత్వం టిడ్కో ఇళ్లను నిర్మించింది. ఇక చేతికి అందుతాయి.. తాము సొంతింటివాళ్లం అవుతాము అని అనుకుంటున్న తరుణంలో ప్రభుత్వం మారింది. జగన్ సీఎం అయ్యారు. ఆయన అధికారంలో ఉన్న ఐదేళ్లూ టిడ్కో ఇళ్లను గాలికి వదిలేశారు. దీంతో పేదలు సైతం వాటిపై ఆశలు వదులుకున్నారు. తిరిగి చంద్రబాబు సీఎం కావడంతో వీరికి టిడ్కో ఇళ్లపై ఆశలు మొదలయ్యాయి. అయితే ఏడునెలలైనా కూటమి ప్రభుత్వం స్పందించకపోవడంతో.. టిడ్కో ఇళ్లు ఇంకెప్పుడు ఇస్తారు అని లబ్ధిదారులు ప్రశ్నిస్తున్నారు.

మౌలిక వసతులు కరువు

కడప, ఎర్రగుంట్లలో ఇళ్ల నిర్మాణం పూర్తికాగా.. జమ్మలమడుగులో మరో 36 ఇళ్ల నిర్మాణం పెండింగులో ఉంది. అంటే జమ్మలమడుగులో ఇంకా ఇళ్ల ఫ్లోరింగ్, విద్యుత్ ఇతరత్రా పనులు పెండింగు ఉన్నాయి. ఇక మూడుచోట్ల రోడ్లు, డ్రైనేజీ, విద్యుత్, అపార్ట్‌మెంటు నుంచి మురుగునీరు వెళ్లే చాంబర్స్ నిర్మాణం పెండింగులో ఉన్నాయి. ఒక్కో చోట మౌలిక వసతుల కోసం జగన్ హయాంలోనే సుమారు రూ.11 కోట్ల వ్యయంతో టెండర్లు పిలిచారు. కడపలో రూ.11.40 కోట్ల వ్యయంతో రోడ్లు, కరెంటు, డ్రైన్స్, అపార్ట్‌మెంట్ల నుంచి వెళ్లే మురుగునీరు వెళ్లే చాంబర్స్, వీటికోసం నిధులు కేటాయించారు. వీటికి 2022లో టెండర్లు నిర్వహించగా ఇంతవరకు పనులే ముందుకు సాగలేదు.

బస్సు డ్రైవర్ల నిరసన

- ఆగిన 27 ఆర్టీసీ అద్దె బస్సులు

పులివెందుల టౌన్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): పులివెందులలో ఆర్టీసీ డిపో వద్ద సోమవారం ఆర్టీసీ అద్దె బస్సుల డ్రైవర్లు నిరసన వ్యక్తం చేయడంతో 27 బస్సులు ఉదయం నుంచి ఆగిపోయాయి. రెండేళ్ల నుంచి 30 అద్దె బస్సుల డ్రైవర్లను సస్పెండ్ చేశారని, ఆర్టీసీలో ప్రభుత్వ డ్రైవర్లకు ఏ నిబంధనలున్నాయో తమకూ అవే వర్తింపజేయాలని పులివెందుల ఆర్టీసీ అద్దె బస్సు డ్రైవర్లు డిమాండ్ చేశారు. సోమవారం తెల్లవారుజాము నుంచి 30 మంది అద్దెబస్సు డ్రైవర్లు ఆర్టీసీ డిపో ఎదుట నిరసన వ్యక్తం చేస్తూ డీఎం డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ కోర్టు ఆదేశాల మేరకు 30 ఎంజీ లోపు వచ్చిన వారిని సస్పెండ్ చేయకూడదని నిబంధనలు ఉన్నాయన్నారు. ఈ నియమాలను పులివెందుల డిపో పరిధిలో పాటించకుండా 18 శాతం రావడంతోనే సస్పెండ్ చేశారని అన్నారు. దీంతో పులివెందుల డిపో పరిధిలో రెండు సంవత్సరాల్లో 30 మంది అద్దెబస్సు డ్రైవర్లను సస్పెండ్ చేశారని అన్నారు. సస్పెండ్ చేస్తూ వెళ్తే డ్రైవర్ల కుటుంబాలు ఎలా బతుకుతాయని ప్రశ్నించారు. అనుభవంలేని డ్రైవర్ల ద్వారా ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. అనుభవం ఉన్న డ్రైవర్లు చేసే చిన్న తప్పులను క్షమించి వారిని మళ్లీ విధుల్లోకి ఆర్టీసీ యాజమాన్యం తీసుకోవాలని డిమాండ్ చేశారు.



పులివెందుల డిపో ఎదుట నిరసన తెలుపుతున్న ఆర్టీసీ అద్దెబస్సు డ్రైవర్లు

అర్జీదారుల సమస్యలపై నిర్లక్ష్యం వద్దు

- జాయింట్ కలెక్టర్ అదితిసింగ్

కడప కలెక్టరేట్, జనవరి 6(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో అర్జీలు సమర్పించే బాధితుల సమస్యల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని జాయింట్ కలెక్టర్ అదితిసింగ్ అధికారులను హెచ్చరించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సభాభవనంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమం జరిగింది. జిల్లా నలుమూలల నుంచి పెద్ద ఎత్తున తరలివచ్చిన ప్రజలు తమ సమస్యలను జాయింట్ కలెక్టర్‌కు, అధికారులకు తెలుపుతూ అర్జీలు సమర్పించారు. వాటిపై తదుపరి చర్యలకై సంబంధిత అధికారులకు సిఫార్సు చేస్తూ, అక్కడికక్కడే కొన్ని సమస్యలను జేసీ పరిష్కరించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా నలుమూలల నుంచి వచ్చే వారిని పదేపదే కార్యాలయాల చుట్టు తిప్పుకోకుండా క్షేత్రస్థాయిలో అధికారులు పరిశీలించి న్యాయం చేయాలన్నారు. అర్జీదారుల సంతృప్తి చెందేలా పారదర్శకంగా విచారణ చేయాలన్నారు. నిర్ణీత గడువులోగా సమస్యలను పరిష్కరించాలన్నారు. అంతకుముందు జడ్పీ సీఈవో ఓబులమ్మ, డీఆర్వో విశ్వేశ్వరనాయుడుతో కలసి పీజీఆర్ఎస్ దరకాస్తులపై జిల్లా అధికారులతో జేసీ సమీక్షించారు.

ముద్దనూరు మండలం కొర్రపాడుకు చెందిన తప్పెట లక్ష్మీనారాయణ ఫిర్యాదు చేస్తూ గండికోట ప్రాజెక్టు మునకలో తమ పూర్వీకులైన మంగలి వీరన్నకు చెందిన సర్వే నెంబరు768లోని 3.48 ఎకరాల భూమి పోయిందన్నారు. కానీ ఈ భూమిని ఆర్టీసీలో రిటైర్డ్ ఉద్యోగి పేరుతో ఆన్‌లైన్ చేశారని దీనిపై ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. ఆ భూమికి సంబంధించిన పరిహారం తమకు అందేలా జెన్యూన్ సర్టిఫికెట్ ఇప్పించాలని జేసీకి విన్నవించారు. చాపాడు మండలం చిన్న గురువలూరుకు చెందిన జాంబరపు గురయ్య తమ రేషన్ దుకాణాన్ని తనిఖీచేసి 6ఏ కేసు నమోదు చేశారని, తిరిగి చౌకదుకాణం ఇవ్వాలని జేసీకి విన్నవించారు. సిద్దవటం మండల ఖాజీపల్లికి చెందిన దుంపల పవన్‌కుమార్‌రెడ్డి తమ గ్రామంలో శ్మశాన వాటికకు దారి సౌకర్యం కల్పించాలని అర్జీ సమర్పించారు. వీరితో పాటు పలువురు అర్జీలు సమర్పించారు. కాగా.. సోమవారం కలెక్టరేట్‌కు వచ్చిన పోరుమామిళ్లకు చెందిన రామయ్య సభాభవనం వద్ద మూర్ఛతో స్పృహ తప్పారు. వెంటనే వైద్యశాఖకు చెందిన అధికారులు, స్టాఫ్‌నర్సు ఆయనకు అత్యవసర చికిత్స చేశారు. అనంతరం 108 వాహనంలో మెరుగైన చికిత్స కోసం రిమ్స్‌కు తరలించారు.



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న జాయింట్ కలెక్టర్ అదితిసింగ్

ప్రాణాలు తీసిన పొగమంచు

- కాలినడక భక్తులను ఢీకొన్న 108 వాహనం
- ఇద్దరి దుర్మరణం, ఐదుగురికి గాయాలు
- కమ్మేసిన మంచులో సంభవించిన ప్రమాదం

చంద్రగిరి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): దట్టమైన పొగమంచు రెండు నిండు ప్రాణాలను బలిగొంది. ఐదుగురిని ఆస్పత్రి పాల్జేసింది. చంద్రగిరి మండలం నరసింగాపురం సమీపంలో మదనపల్లె జాతీయ రహదారిలో నారాయణ కళాశాల వద్ద సోమవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మహిళలు చనిపోయారు. పుంగనూరు సమీపంలోని రామసముద్రం మండలం శేగంవారిపల్లెకు చెందిన సుమారు 60 మంది శ్రీవారి భక్తులు ఆదివారం కాలినడకన తిరుమల శ్రీవారి దర్శనానికి బయలుదేరారు. సోమవారం తెల్లవారుజామున 3-30 గంటలకు నరసింగాపురం వద్ద వీరిని 108 వాహనం ఢీకొంది. ఏడుగురికి తీవ్ర గాయాలవ్వడంతో అదే వాహనంలో తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించారు. అప్పటికే పెద్దరెడ్డమ్మ (40), లక్ష్మమ్మ (50)లు మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. తులసమ్మ, రమేష్, చిన్నరెడ్డమ్మ, రెడ్డమ్మ, యశోదమ్మలకు తీవ్ర గాయాలయ్యాయి. తులసమ్మ పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. మృతురాలు పెద్ద రెడ్డమ్మ,ఆమె భర్త రమణ వ్యవసాయ కూలీలు. కుమారులు రెడ్డిమోహన, రెడ్డిప్రసాద్‌లు ఇంటర్మీడియట్ చదువుతున్నారు. మరో మృతురాలు లక్ష్మమ్మకు భర్త లక్ష్మన్న, కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కుమార్తెలకు పెళ్లిళ్లయ్యాయి. కుమారుడు నవీన్ డిగ్రీ చదివి ఉద్యోగం ప్రయత్నంలో ఉన్నాడు. పోలీసులు ప్రమాద స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన పెద్ద రెడ్డమ్మ

మంచులో ప్రయాణాలు తగదు

తీవ్రమైన చలి, పొగమంచు కమ్ముకోవడం వల్లే ఈ దుర్ఘటన జరిగిందని పోలీసులు భావిస్తున్నారు. తెల్లవారుజామున వేగంగా వస్తున్న 108 వాహనానికి లైటింగ్ కనిపించలేదని తెలుస్తోంది. మదనపల్లెకు చెందిన హరికృష్ణకు గుండెపోటు రావడంతో ఈ వాహనంలో తిరుపతి తరలిస్తున్నారు. అదే సమయంలో భక్తులు చలి, పొగమంచును సైతం పట్టించుకోకుండా నడిచి వస్తున్నారు. శ్రీవారిమెట్టు వద్ద ఉదయం 6 గంటలకు కాలినడక భక్తులకు దర్శనం టోకెన్లు పరిమితంగా ఇస్తున్నారు. ఈ క్రమంలో ఉదయం 5 గంటల కల్లా ఎక్కువమంది శ్రీవారి మెట్టుకు త్వరగా చేరుకుంటున్నారు. కాగా మంచు విపరీతంగా ఉన్నందున వాహనదారులు అర్ధరాత్రి దాటాక ప్రయాణాలు రద్దు చేసుకోవాలని సీఐ సుబ్బరామిరెడ్డి సూచిస్తున్నారు. అత్యవసర ప్రయాణాలైతే నిదానంగా వాహనాలను నడపాలంటున్నారు. తరచూ ఆగుతూ వాహనాల ముందు అద్దాలను తుడుచుకోవాలని సూచిస్తున్నారు రాత్రి పూట పాదయాత్రను వాయిదా వేసుకుని, పగటి పూట నడవాలని శ్రీవారి భక్తులను ఆయన కోరుతున్నారు.

నంద్యాల సబ్‌రిజిస్ట్రార్ సస్పెన్షన్

- కోర్టు స్టే ఉండగా.. నంద్యాలలో ఆస్తి రిజిస్ట్రేషన్

ప్రొద్దుటూరు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): కోర్టు స్టే ఉండగా ఆస్తి రిజిస్ట్రేషన్ చేసినందుకు నంద్యాల జాయింట్ సబ్ రిజిస్ట్రార్‌ను సస్పెండ్ చేస్తూ కర్నూలు రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ పీజీఎస్ కల్యాణి ఉత్తర్వులు జారీ చేశారు. వివరాలిలా.. ప్రొద్దుటూరులోని కోనేటికాల్వ వీధికి చెందిన సర్వేనెంబరు 483లోని ఆస్తికి సంబంధించి డాక్యుమెంట్ నెంబరు 15143/2024పై ప్రొద్దుటూరు సెకండ్ అడిషనల్ డిస్ట్రిక్ట్ జడ్జి కోర్టులో స్టే ఆర్డర్ ఉంది. అయితే నంద్యాల జాయింట్ సబ్‌రిజిస్ట్రార్ నాయబ్ అబ్దుల్‌సత్తార్ విచారణ జరపకుండానే ఎనీవేర్ రిజిస్ట్రేషన్ కింద ఆ ఆస్తిని రిజిస్ట్రేషన్ చేసేశారు. దీంతో కర్నూలు రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ డీఐజీ సోమవారం సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ చేశారు. సస్పెన్షన్ ఉన్నంత వరకు హెడ్‌క్వార్టర్స్ వదిలి బయటికి వెళ్లరాదని ఆదేశించారు.

జిల్లాలో ఓటర్లు 16,41,864 మంది

- మహిళా ఓటర్లదే ఆధిక్యం
- పురుషులకంటే దాదాపు 37 వేల మంది ఎక్కువ

కడపకలెక్టరేట్, జనవరి 6(ఆంధ్రజ్యోతి): జిల్లాలో మొత్తం ఓటర్లు 16,41,864 మంది ఉన్నారు. ఈ మేరకు ఓటరు జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ-2025లో భాగంగా అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా సోమవారం ఓటర్ల తుది జాబితాను జిల్లా రెవెన్యూ అధికారి విశ్వేశ్వర నాయుడు ఒక ప్రకటన ద్వారా విడుదల చేశారు. అందులో పేర్కొన్న మేరకు పురుష ఓటర్లు 8,02,373 మంది, మహిళా ఓటర్లు 8,39,276 మంది, ట్రాన్స్‌జెండర్స్ 215 మంది ఉన్నారు. వీరు కాకుండా సర్వీసు ఓటర్లు 2,195 మంది ఉన్నారు. అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా, పోలింగ్ స్టేషన్ల వారీగా జాబితాను విడుదల చేశారు. కాగా.. జిల్లాలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా.. ప్రతిచోటా పురుషులకన్నా మహిళా ఓటర్లే ఎక్కువగా ఉన్నారు. అత్యధికంగా ప్రొద్దుటూరు నియోజకవర్గంలో పురుషుల కంటే మహిళా ఓటర్లు 7,977 మంది ఎక్కువ ఉన్నారు. అలాగే జమ్మలమడుగు నియోజకవర్గంలోనూ 7,057 మహిళా ఓటర్లు ఎక్కువగా ఉన్నారు.

నియోజకవర్గాల వారీగా..

నియోజకవర్గం	మహిళలు	పురుషులు	ట్రాన్స్‌జెండర్స్	మొత్తం
కడప	1,38,823	1,45,562	89	2,84,474
బద్వేలు	1,09,492	1,10,423	5	2,19,920
పులివెందుల	1,11,854	1,18,004	19	2,29,877
కమలాపురం	1,00,194	1,04,586	34	2,04,814
జమ్మలమడుగు	1,17,705	1,24,762	15	2,42,482
ప్రొద్దుటూరు	1,20,083	1,28,060	49	2,48,192
మైదుకూరు	1,04,222	1,07,879	4	2,12,105
మొత్తం	8,02,373	8,39,276	215	16,41,864

శ్రీగంధం సాగు.. ఆదాయం బాగు...

- గతంలో పొలాల గట్లపై...
- స్మగ్లర్లతో అంతరించిన వైనం
- మళ్లీ సాగు చేస్తున్న రైతులు
- కోడూరు నుంచి ఏడాదికి 6 లక్షల మొక్కల ఎగుమతి

6



6వ రోజు కొనసాగిన దేహదారుఢ్య పరీక్షలు

కడప క్రైం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): పోలీసు నియామక ప్రక్రియలో భాగంగా కడప ఉమ్మడి జిల్లాకు సంబంధించి కడప నగర శివార్లలోని జిల్లా పోలీసుశిక్షణ కేంద్రం (డీటీసీ)లో దేహదారుఢ్య పరీక్షలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా 6వ రోజు సోమవారం ఇన్‌చార్జి ఎస్పీ వి.విద్యాసాగర్‌నాయుడు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీసు కానిస్టేబుల్ ప్రిలిమినరీ పరీక్షను పూర్తి చేసిన అభ్యర్థులకు ఫిజికల్ మెజర్‌మెంట్, ఫిజికల్ ఎఫిషియెన్సీ టెస్టులకు ఉమ్మడి కడప జిల్లాలో 4,492 మంది అభ్యర్థులు పాల్గొంటున్నారన్నారు. 6వ రోజు సోమవారం 600 మంది అభ్యర్థులకు గాను 406 మంది హాజరయ్యారని, 257 మంది క్వాలిఫై అయ్యారన్నారు. ప్రతిరోజూ అభ్యర్థులకు మొదట సర్టిఫికెట్స్ పరిశీలన, ఎత్తు, ఛాతీ వంటి ఫిజికల్ మెజర్‌మెంట్స్ చేస్తారని, తరువాత బయోమెట్రిక్ తీసుకుంటారన్నారు. దేహదారుఢ్య పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు వెరిఫికేషన్ కోసం కచ్చితంగా ఒరిజినల్ ధ్రువపత్రాలతో హాజరు కావాలని, నోటిఫికేషన్ వచ్చిన తరువాత జారీ చేసిన లేటెస్ట్ కులధ్రువీకరణ పత్రం, నాన్ క్రిమిలేయరు సర్టిఫికెట్లు తీసుకురావాలన్నారు. వాటితో పాటు అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లు, జిరాక్స్ సర్టిఫికెట్లు అటెస్ట్ చేసినవి తప్పనిసరిగా తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) కె.ప్రకాశ్‌బాబు, ఏఆర్ అడిషనల్ ఎస్పీ రమణయ్య, డీఎస్పీలు, సీఐలు, ఆర్ఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.



అభ్యర్థుల ఎత్తు కొలుస్తున్న పోలీసు అధికారులు

ధాన్యం కొంటారా...?

- మొదలుకాని ధాన్యం కొనుగోళ్లు
- ఎమ్మెల్యే చొరవ చూపినా ఆలస్యమే!
- అన్నదాతల ఎదురుచూపు

ప్రొద్దుటూరు రూరల్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ధాన్యం కొనుగోలు విధానంలో మార్పులు తీసుకొచ్చి అన్నదాతలకు అండగా నిలిచింది. గత ఏడాది వైసీపీ హయాంలో ఎదుర్కొన్న ఇబ్బందులు పునరావృత్తం కాకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టింది. ఇతర జిల్లాల్లో ప్రక్రియ సజావుగా సాగుతూ కీలకదశకు చేరుకున్న తరుణంలో ప్రొద్దుటూరు నియోజకవర్గ ప్రాంతంలో ఇప్పటికీ కొనుగోలు ప్రక్రియ మొదలుకాలేదు. ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి ప్రత్యేక చొరవ చూపినా అనివార్య కారణాలతో అధికారులు ధాన్యం కొనుగోలు ప్రక్రియను వాయిదా వేస్తూ వస్తున్నారు. దీంతో అన్నదాతలు మద్దతు ధర కోసం ఎదురుచూపులు చూస్తున్నారు.

జిల్లాల్లో ఈ ఏడాది ఖరీఫ్ సాగు ఆశాజనకంగానే సాగింది. గతంలో ఎన్నడూ లేనంతగా ఎకరాకు సగటు 33 నుంచి 38 బస్తాల వరకు ధాన్యం దిగుబడులు వచ్చాయి. నియోజకవర్గంలో ఒక్క ప్రొద్దుటూరు మండలంలో 3,700 ఎకరాల్లో వరి సాగైంది. రాజుపాళెం మండలంలో 2,500 ఎకరాల వరకు రైతులుసాగు చేశారు. వరి కోత దశ చేరిన సమయంలో నవంబరు, డిసెంబరు నెలల్లో చోటు చేసుకున్న వాతావరణ మార్పులు, రైతులకు కన్నీళ్లు మిగిల్చాయి. వరుస అల్పపీడనాలతో కోత దశలోని వరిపైరు అతలాకుతలం అయింది. పంట తడిసి నీటమునిగి రైతులు నానా తంటాలు పడ్డారు. చేతికొచ్చిన పంటను ఆరబెట్టుకునేందుకు నిలువ ఉంచుకునేందుకు తగిన సౌకర్యం లేక గిట్టుబాటు ధర లేకపోయినా విధి లేని పరిస్థితుల్లో ప్రైవేటు మిల్లులకు అమ్ముకున్నారు. ఇదే అదునుగా తేమ శాతం అధికంగా ఉందని, 78 కిలోల బస్తాకు రూ.1300 నుంచి రూ.1400 చెల్లించి కొనుగోలు చేసి రైతులకు గిట్టుబాటు లేకుండా దోపిడీకి పాల్పడ్డారని ఆరోపణలు ఉన్నాయి. ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో కూడా అధికారుల నుంచి ఎలాంటి ఆదేశాలు లేకపోవడంతో చేతికందిన దిగుబడిని ఎక్కడ దాచిపెట్టాలో, ఎవరికి అమ్ముకోవాలో తెలియని ఆందోళనకు అన్నదాతలు గురయ్యారు. వర్షాల ప్రభావంతో కోతలను వాయిదా వేసుకుని ఆలస్యంగా యంత్రాల సహాయంతో నూర్పిళ్లు ప్రారంభించారు. కూలీల చేత పంట కోత ఆలస్యం అవుతుండడం, కూలీల కొరత ఉండడం, అధిక వ్యయాలతో యంత్రాలపై ఆధారపడి పంటను సాగు చేసుకునే చర్యల్లో నిమగ్నమయ్యారు.

ఎమ్మెల్యే చొరవతో...

ఒకవైపు వరుస అల్పపీడనాలు, వర్షాలు, మరోవైపు సరైన గిట్టుబాటు ధర లేక ఆందోళన చెందుతున్న రైతన్నకు అండగా నిలిచేందుకు ప్రొద్దుటూరు ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి చొరవ చూపి జిల్లా వ్యవసాయ శాఖ, పౌరసరఫరాల అధికారులతో చర్చించారు. కలెక్టర్ దృష్టికి సమస్యను తీసుకెళ్లి ప్రొద్దుటూరులోనే ధాన్యం కొనుగోలు చేసేలా ఒప్పించారు. ఎట్టకేలకు డిసెంబరు 23వ తేదీ నుంచి ప్రొద్దుటూరులోనే కొనుగోలు ఏర్పాటు చేయనున్నట్లు రైతుల వద్దకు వెళ్లి ఎంఎస్‌పీ రేటు ప్రకారం క్వింటా రూ.2,300 ధరతో సివిల్‌సప్లై అధికారులు కొనుగోలు చేస్తారని వ్యవసాయాధికారులు ప్రకటించారు. అన్నదాతలు తమ పేర్లను రైతు సేవా కేంద్రాల్లో నమోదు చేసుకోవాలని ఈ కేంద్రాల వారీగా లక్ష్యాలను నిర్దేశించారు. అయితే సాంకేతిక పరమైన అనుమతులు అందక, మిల్లుల నుంచి ఏర్పడిన సమస్యల కారణంగా కొనుగోలు ప్రారంభం తేదీ వాయిదా పడింది. సమస్యలు తొలగి అధికారుల నుంచి ఎప్పుడు ఆదేశాలు వస్తాయోనని రైతన్నలు వెయ్యి కళ్లతో ఎదురుచూస్తున్నారు.




కానపల్లెలో రైతులు ఆరబెట్టిన ధాన్యం

త్వరలో కొనుగోలు చేస్తాం

అన్నదాతల నుంచి ధాన్యం కొనుగోలు ప్రక్రియను అతి త్వరలో చేపడతాం. మిల్లర్ల వద్ద నుంచి బ్యాంకు గ్యారెంటీలు అందడం ఆలస్యమైంది. రెండు, మూడు రోజుల్లో రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేస్తాం.

-అర్జునరావు, డీఎం, పౌరసరఫరాల సంస్థ

గిట్టుబాటు లేకపోయినా...



అల్పపీడనాలతో ధాన్యం తడిసి నష్టాల భయంతో 78 కిలోల బస్తా రూ.1400 చొప్పున ప్రైవేటు మిల్లులకు అమ్ముకున్నాను. అధికారుల నుంచి ఎలాంటి ప్రకటనలు వెలువడకపోవడంతో గిట్టుబాటు ధర లేకపోయినా అమ్ముకునే పరిస్థితి ఏర్పడింది.

- ఏటూరి సుధాకర్, చెంచుపల్లె గ్రామం

ధర నచ్చక...



ప్రైవేటు మిల్లర్ల యజమానులు చెప్పే ధర నాకు నచ్చలేదు. ఆరుగాలం శ్రమించి పండించిన పంటకు వారు చెప్పే రేటు గిట్టుబాటు కావడం లేదు. ధాన్యం ఎండబెట్టి ఇంటి వద్దనే నిలువ ఉంచాను. సరైన ధర వచ్చినప్పుడు అమ్ముతాను.

- కె.వెంకటసుబ్బయ్య, కానపల్లి

నైపుణ్య శిక్షణతో మంచి ఫలితాలు



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, జేసీ, తదితరులు

- కలెక్టర్ చామకూరి శ్రీధర్

రాయచోటి(కలెక్టరేట్), జనవరి 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో నైపుణ్య శిక్షణ ద్వారా ఉత్తమమైన ఉపాధి ఫలితాలు వచ్చేందుకు కృషి చేయాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం రాయచోటి కలెక్టరేట్‌లో వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో కలెక్టర్ అధ్యక్షతన జిల్లా స్థాయి స్కిల్ కమిటీ మీటింగ్ నిర్వహించారు.

ఈ సందర్భంగా కార్యక్రమంలో భాగంగా జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి దాసరి నాగార్జున, కమిటీ సభ్యులందరూ జిల్లాలో నైపుణ్య శిక్షణల గురించి వారి అభిప్రాయాలను కలెక్టర్‌కు వివరించారు. అలాగే రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా సంకల్ప స్కీంతో జిల్లాలో చేపట్టాల్సిన నైపుణ్య కార్యక్రమాల గురించి కమిటీ సభ్యులదరికీ వివరించారు. ఈ సందర్భంగా భవిష్యత్తు కార్యక్రమం గురించి కలెక్టర్ ఆధ్వర్యంలో సమావేశంలో చర్చించారు. జిల్లాలో చదువుకున్న నిరుద్యోగ యువతకు జీవనోపాధికి అవసరమైన నైపుణ్యాలను పెంపొందించే విధంగా కార్యక్రమాలను రూపకల్పన చేయాలని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారిణి, సభ్యులకు కలెక్టర్ సూచించారు. సమావేశంలో పీఎం ఇంటర్న్‌షిప్ కరపత్రాలను కలెక్టర్, జేసీ ఆవిష్కరించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఆదర్శ్‌రాజేంద్రన్, డీఆర్‌పీ, మెప్మా పీడీలు, జేడీ అగ్రికల్చర్, ఇండస్ట్రీస్ జనరల్ మేనేజర్, లీడ్ బ్యాంకు మేనేజర్, రాయచోటి మున్సిపల్ కమిషనర్, కమిటీ సభ్యులు, నైపుణ్యాభివృద్ధి సంస్థ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చేనేత కార్మికులకు ప్రభుత్వ పథకాలు

జిల్లా చేనేత, జౌళి శాఖ సహాయ సంచాలకుడు కృష్ణ వెల్లడి



క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న జేడీ, యూనియన్ నేతలు

రాయచోటి టౌన్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): చేనేత కార్మికులకు ప్రభుత్వ పథకాలు అందించేందుకు సిద్ధంగా ఉన్నామని చేనేత, జౌళి శాఖ జిల్లా సహాయ సంచాలకులు కృష్ణ తెలిపారు. సోమవారం జిల్లా చేనేత, జౌళిశాఖ కార్యాలయంలో చేనేత కార్మిక యూనియన్ ముద్రించిన-2025 సంవత్సరపు క్యాలెండర్‌ను చేనేత, జౌళి శాఖ జిల్లా సమాయ సంచాలకులు కృష్ణ ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేనేత కార్మిక యూనియన్ ముద్రించిన క్యాలెండర్ ఆవిష్కరించడం ఆనందంగా ఉందన్నారు. చేనేత కార్మికులకు ఇలాంటి సంఘాల వల్ల ఎంతో ఉపయోగం ఉంటుందని వివరించారు. 34 సంవత్సరాలుగా చేనేత కార్మికుల సంక్షేమం, ఉపాధి, చేనేత రంగ రక్షణకు చేనేత కార్మిక యూనియన్ నాయకులు పనిచేస్తున్నారని, వారి కృషి అభినందనీయమన్నారు. అన్నమయ్య జిల్లాలో చేనేత కార్మికులకు ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ పథకాలను మా శాఖ ద్వారా సక్రమంగా అమలు చేస్తామని, చేనేత కార్మికులకు ఏదైనా సందేహాలు, ఇబ్బందులు ఉంటే మమ్మల్ని నేరుగా సంప్రదించాలని ఆయన కోరారు.

సమావేశంలో చేనేత, జౌళిశాఖ సహాయ అభివృద్ధి అధికారి వెంకటకుమార్, ప్రవీణ్‌కుమార్‌రాజు, చేనేత కార్మిక యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఆకుల వాసు, రాష్ట్ర ఉపాధ్యక్షులు రాంమోహన్, రాష్ట్ర కార్యదర్శి గురుస్వామి, జిల్లా అధ్యక్షుడు గుంపు వెంకటేశ్, జిల్లా ఉపాధ్యక్షుడు మోడెం వెంకటేశ్, జిల్లా ప్రధాన కార్యదర్శి ముదిశెట్టి తిరుమలేశ్, తంబళ్లపల్లె అధ్యక్షుడు అనంత ఈశ్వరయ్య తదితర చేనేత కార్మికులు పాల్గొన్నారు.

వేర్వేరు ఘటనల్లో ఇద్దరు మహిళల మృతి

ప్రమాదవశాత్తు కింద పడి ఒకరు.. పొలంలో గుండెపోటుతో మరొకరు



తలారి సుబ్బమ్మ (ఫైల్)

పెద్దతిప్పసముద్రం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : వేర్వేరు సంఘటనల్లో ఇద్దరు మహిళలు మృతి చెందిన సంఘటనలు పెద్దతిప్పసముద్రం మండలంలో జరిగాయి. ఆయా కుటుంబీకులు అందించిన సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. మండలంలోని పులికల్లు గ్రామానికి చెందిన తలారి బావన్న భార్య తలారి సుబ్బమ్మ (65) సోమవారం ఉదయం బహిర్భూమికి ఆరు బయటికి వెళ్లి వస్తూ కిందపడిపోయింది. స్థానికులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. కుటుంబీకులు ఘటనా స్థలానికి చేరుకుని ఆసుపత్రికి తరలించే క్రమంలో ఆమె మృతి చెందినట్లు తెలియచేశారు. అదే విధంగా మండలంలోని రంగసముద్రం గ్రామం బొంతవారిపల్లెకు చెందిన జగడం క్రిష్ణమూర్తి భార్య జగడం కళావతమ్మ (55) సోమవారం మధ్యాహ్నం తమ కుటుంబ సభ్యులు పొలం పనులు చేస్తుండగా వారికి భోజనం తీసుకెళ్లింది. పొలం వద్దకు చేరుకోగానే ఉన్నట్టుండి ఒక్కసారిగా గుండెపోటు రావడంతో పొలంలోనే కుప్పకూలిపోయింది గమనించిన కుటుంబ సభ్యులు 108 వాహనానికి ఫోన్ చేయగా వాహనం అక్కడకు చేరుకుంది అప్పటికే ఆమె మృతి చెందినట్లు సిబ్బంది తెలియ చేశారు. మృతురాలికి ఒక కుమారుడు కుమార్తె ఉన్నారు.

ప్రజల ఫిర్యాదులను అలక్ష్యం చేయొద్దు



సమస్యలు తెలుసుకుంటున్న ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు

- ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు

రాయచోటిటౌన్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదిక ఫిర్యాదుల పరిష్కారంలో అలసత్వం చేయకుండా వెంటనే వాటిని పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు పోలీసు అధికారులను ఆదేశించారు.

జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల నుంచి అర్జీలను స్వీకరించి వారికి మాట్లాడి సమస్యలను తెలుసుకొని వారి ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించారు.

సమస్యలపై విన్నవించుకునేందుకు జిల్లా పోలీసు కార్యాలయానికి రాలేని ప్రజలు జిల్లాలోని ఆయా పోలీస్‌స్టేషన్స్, సర్కిల్ కార్యాలయాలు, సబ్ డివిజన్ కార్యాలయాల్లో ఫిర్యాదు చేయవచ్చునని సూచించారు. ఆ ఫిర్యాదులపై కూడా సత్వర న్యాయం చేస్తామని ఎస్పీ తెలిపారు.

చికిత్స పొందుతూ రైతు మృతి



ఒంటిమిట్ట, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : అప్పుల బాధ తాళలేక పురుగు మందు తాగిన రైతు చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్లు ఎస్ఐ శివప్రసాద్ తెలిపారు. మండల పరిధిలోని గంగపేరూరుకు చెందిన దూల సుబ్బారెడ్డి (57) వ్యవసాయంలో నష్టం రావడంతో అప్పుల పాలయ్యాడు.

వాటిని ఎలా తీర్చాలో దిక్కుతోచక పోవడంతో రెండు రోజుల క్రితం పొలం వద్ద షెడ్డులో పురుగుల మందు తాగాడు, అపస్మారక స్థితిలో పడిపోయిన అతనిని బంధువులు కడప రిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు.. దీనిపై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఆయన వివరించారు.





ములకలచెరువు గజ..గజ...

- ఉదయం 10 గంటల వరకు కప్పేసిన పొగమంచు

ములకలచెరువు, జనవరి 6: ములకలచెరువును సోమవారం పొగమంచు కప్పేసింది. ఉదయం 10 గంటల వరకు పొగమంచుతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. భారీ పొగమంచుతో పాటు చలి తీవ్రత ఎక్కువగా ఉండడంతో ప్రజలు వణికిపోయారు. పాఠశాలలకు వెళ్లేందుకు విద్యార్థులు అవస్థలు పడ్డారు. ముంబాయి-చెన్నై జాతీయ రహదారిలో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మంచుతో ఎదురుగా వచ్చిన వాహనాలు కన్పించకపోవడంతో లైట్లు వేసుకుని నెమ్మదిగా రాకపోకలు సాగించారు.



పొగమంచులో జాతీయ రహదారి

శ్రీగంధం సాగు.. ఆదాయం బాగు...

- గతంలో పొలాల గట్లపై...
- స్మగ్లర్లతో అంతరించిన వైనం
- మళ్లీ సాగు చేస్తున్న రైతులు
- కోడూరు నుంచి ఏడాదికి 6 లక్షల మొక్కల ఎగుమతి

రైల్వేకోడూరు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): శ్రీగంధం చెట్ల సాగుతో మంచి ఆదాయం గడించవచ్చని కొందరు రైతులు వీటి సాగు పట్ల మక్కువ చూపుతున్నారు. గతంలో రైతులు తమ పొలాల గట్ల పైన వీటిని నాటుకునే వారు. అయితే స్మగ్లర్లు వాటిని నరికివేసి ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేసేవారు. దీంతో శ్రీగంధం చెట్లు లేకుండా అంతరించిపోయాయి. అయితే వీటిని మళ్లీ రైతులు సాగు చేస్తున్నారు. శ్రీగంధం చెట్టు పెద్దగా లావు ఉండదు. సుమారు 20 అడుగుల ఎత్తు పెరుగుతుంది. శ్రీగంధం బెరడు, పుల్లలు, కాండం తదితరాలు పనికి వస్తాయి. ఒక్క శ్రీగంధం చెట్టు బాగా పెరగడానికి సుమారు 25 ఏళ్ల సమయం పడుతుంది. పుల్లలు, కాండంలను ముక్కలుగా కట్ చేసి ఆయిల్ తీస్తారు. బెరడు నుంచి వచ్చిన పౌడర్‌ను సోప్స్ పరిశ్రమలకు పంపిస్తారు. శ్రీగంధం నుంచి తీసిన ఆయిల్ ఇతర దేశాలకు ఎగుమతి చేస్తున్నారు. వివిధ రకాల సుగంధ ద్రవ్యాల్లో దానిని కలుపుతారు.

దేశంలోని కోల్‌కత్తా, బెంగళూరు, హరియానా, కొవ్వూరు ప్రాంతాల్లో శ్రీగంధం పరిశ్రమలు ఉన్నాయి. ఎక్కువగా శ్రీగంధం మొక్కలు తెలంగాణ, మైసూరు, గుంటూరు, ప్రకాశం, ఒరిస్సా తదితర ప్రాంతాలకు వ్యాపారులు ఎగుమతి చేస్తున్నారు. ఒక్క శ్రీగంధం మొక్క 20 రూపాయలకు రైల్వేకోడూరు నర్సరీల్లో విక్రయాలు చేస్తున్నారు. టన్ను శ్రీగంధం చెక్కలు రూ.7 లక్షలు ధర ఉంది. వీటికి విపరీతంగా డిమాండ్ ఉంది. నాణ్యత గల ఆయిల్ కిలో సుమారు రూ.2 లక్షలకు పైగా ఉంటుందని వ్యాపారులు అంటున్నారు. ఎకరా పొలంలో శ్రీగంధం సాగుకు రూ.70 వేల నుంచి రూ.80 వేలు అవుతుంది. మొదట ఖర్చు ఎక్కువగా అనిపించినా రాను రాను ఖర్చు తక్కువగా ఉంటుందని రైతులు అంటున్నారు. ఎకరాకు 500 మొక్కలు పడతాయి.

ఇతర దేశాల్లో వీటికి మంచి డిమాండ్ ఉంది. రైల్వేకోడూరులో 11 ఏళ్ల నుంచి వివిధ నర్సరీల వ్యాపారులు మొక్కలను పెంచి ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేస్తున్నారు. 2011 నుంచి కరోనా సమయం వరకు ప్రతి ఏడాది 6 లక్షల మొక్కలను ఎగుమతి చేశారు. కరోనా తర్వాత ప్రతి ఏటా లక్ష మొక్కలను ఎగుమతి చేశారు. ప్రస్తుతం మళ్లీ వ్యాపారం పెరిగిందని వ్యాపారులు అంటున్నారు. రైల్వేకోడూరు, ఓబులవారిపల్లె, చిట్వేలి, పెనగలూరు, పుల్లంపేట మండలాల్లో సుమారు 50 ఎకరాల్లో శ్రీగంధం మొక్కలను రైతులు సాగు చేస్తున్నారు. అయితే ఈ పంటను కాపాడుకోవాలి. స్మగ్లర్ల భయం ఎక్కువగా ఉంటుంది. స్మగ్లర్ల కంటికి కనిపిస్తే చాలు నరికివేసి వాటిని తరలిస్తారు. కాబట్టి జాగ్రత్తగా ఈ పంటను కాపాడుకుంటే మంచి లాభాలు పొందే అవకాశం ఉంటుంది. ఎర్రచందనం కంటే ఎక్కువగా డిమాండ్ కల్గింది శ్రీగంధం. వివిధ కంపెనీలకు చెందిన శాండల్ ఉడ్ సోప్స్ మార్కెట్‌లోకి వస్తున్నాయి. ఎక్కువగా మైసూరులో తయారు చేసే శాండల్ సోప్స్‌లో శ్రీగంధంను వినియోగిస్తున్నారు. ఇలాంటి ఆదాయం వచ్చే శ్రీగంధం సాగును రైతులు మరింత చేపడితే లాభాలు పొందవచ్చు. ఎకరాకు ఆదాయం సుమారు రూ.కోటి వస్తుందని అంచనా. నియోజకవర్గంలో రైతులు శ్రీగంధం సాగుపై ప్రస్తుతం రైతులు ఎక్కువగా మక్కువ చూపుతున్నారు.



రైల్వేకోడూరు మండలంలో సాగవుతున్న శ్రీగంధం చెట్లు



రైల్వేకోడూరు నర్సరీలో శ్రీగంధం మొక్కలు

ఆదాయం ఉందని సాగు చేస్తున్నాము

శ్రీగంధం సాగులో ఆదాయం బాగా ఉందని సాగు చేపట్టాము. ఇప్పటికి ఏడాది అయింది. మొదట ఖర్చు ఎక్కువగా వచ్చినా తర్వాత సాగుకు ఖర్చు తగ్గింది. సాగులో ఎలాంటి ఇబ్బంది లేదు. స్మగ్లర్ల భయం తప్ప మరేది లేదు. శ్రీగంధంకు మంచి డిమాండు ఉంది. ధర కూడా బాగా ఉంటుంది.

- చంగల్రాయుడు, రైతు, రైల్వేకోడూరు

కొత్త ఏడాదిలో శ్రీగంధం మొక్కల పెంపకం

కొత్త ఏడాదిలో శ్రీగంధం మొక్కల పెంపకం చేపడుతున్నాము. అటవీశాఖ నర్సరీలో పెంపకం చేస్తాము. రైతులకు ఉచితంగా మొక్కలు సరఫరా చేస్తాము. ఇందుకు ప్రణాళిక తయారు చేసి ఉన్నతాధికారులకు నివేదిక పంపాము. అనుమతి రాగానే మొదలు పెడతాము.

- శ్యాంసుందర్, రేంజర్, రెల్వేకోడూరు

ఉద్యానపంటలపై రైతుల ఆసక్తి

- పోరుమామిళ్ల డివిజనులో 7వేల ఎకరాల్లో సాగు
- రైతులకు ప్రోత్సాహకంగా రాయితీలు
- కొత్తగా రాయితీలు పొందాలంటే.. దరఖాస్తు చేసుకోవాల్సిందే..

పోరుమామిళ్ల, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): పోరుమామిళ్ల డివిజనులో రైతులు ఉద్యానపంటలపై ఆసక్తి కనబరుస్తున్నారు. ముఖ్యంగా పోరుమామిళ్ల, కలసపాడు, కాశినాయన, బికోడూరు మండలాల్లో అరటి, దానిమ్మ, మామిడి, తైవాన్ జామ, బత్తాయి, నిమ్మ, బొప్పాయి పంటలపై ఎక్కువ ఆసక్తి కనబరుస్తూ దాదాపు 7వేల ఎకరాల్లో సాగు చేశారు. పోరుమామిళ్ల మండలంలో నాగలకుంట్ల, పుల్లీడు, బొప్పాపురం, రజాసాహెబ్‌పేట, అక్కల్‌రెడ్డిపల్లె, కవలకుంట్ల, రంగసముద్రం, గురప్పగారిపల్లె ప్రాంతాల్లో ఎక్కువగా బొప్పాయి, దానిమ్మ, తైవాన్‌జామ వంటి పంటలు సాగు చేశారు. సిద్దవరం సమీపంలో కొండుగారిపల్లె, చెన్నారెడ్డిపేట ప్రాంతాల్లో కూడా ఎక్కువగా తైవాన్ జామ, దానిమ్మ పంటలను సాగు చేశారు. నాలుగు మండలాలకు సంబంధించి దాదాపు 7వేల ఎకరాల్లో ఉద్యాన పంటలు సాగయ్యాయి. అరటి 1694 హెక్టార్లలో, బత్తాయి 409, ఆయిల్‌పాం 354, మామిడి 311, నిమ్మ 297, జామ 285, పసుపు 270, కొబ్బరి 275, టమోటా 245, తమ లపాకు 120, దానిమ్మ 104, సీతాఫలం 52, నన్నారి 39, డ్రాగన్‌ఫ్రూట్ 13, రేగుపండ్లు 61, రోజాపూలు 112, నేరేడు 11హెక్టార్లలో సాగయ్యాయి.

ఉద్యాన పంటలకు రాయితీలు ఇలా...

దానిమ్మ, జామ, బత్తాయి, నిమ్మ వంటి ఉద్యాన పంటల సాగు చేపట్టే రైతులకు మొక్కల పెంపకానికి ఖర్చులో దాదాపు 40 శాతం రాయితీ అందిస్తున్నారు. మామిడికి సంబంధించి హెక్టారుకు 178 మొక్కలకు రూ.13400, జామ 1111కు 29301, దానిమ్మ 667కు 26672, బత్తాయి నిమ్మ 278కు 16004, అంజీరా 625 మొక్కలకు 30వేలు, ఉసిరి 150కి 18వేలు, అవకాడో 425 మొక్కలకు రూ.18వేలు, వాక్కాయ 2500 మొక్కలకు 18వేలు వంతున ఇస్తారు. టమోటా, వంకాయ, కాకర లాంటి కూరగాయల పంటలను ఆధునిక సాంకేతికంగా పేపరు వేసి లేదా కట్టలు కట్టి సాగు చేపడితే హెక్టారుకు ఒకటికి రూ.20వేలు ఆర్థిక సాయం అందుతుంది. వివిధ రకాల ఉద్యానపంటలను మల్చింగ్ లేదా పేపరు వేసి సాగు చేస్తే హెక్టారు ఒకటికి రూ.16వేలు రాయితీ అందజేస్తారు. సాగునీటి వనరులను రైతులు నిల్వ చేసుకుని పంటలు వాడుకోవడానికి పంట పొలంలో నీటి కుంటలు 20 ఇంటు 20 ఇంటు 3 ఘన మీటరులో ఏర్పాటు చేసుకుంటే రూ.75వేలు ఆర్థిక సాయం అందిస్తున్నారు. రైతు పండించిన ఉద్యా న ఉత్పత్తులన్నీ గ్రేడింగ్ చేసి నేరుగా పొలం నుంచి మార్కెట్‌కు తరలించడానికి పొలంలో ఫామ్ హౌస్ నిర్మించుకుంటే రూ.2 లక్షలు ఆర్థిక ప్రోత్సాహం అందిస్తున్నారు. కూరగాయ, ఉద్యాన పంటల నారు పెంపకం మార్కెట్ అధిక డిమాండ్ ఉండి పూలు, కూరగాయల సాగు చేపట్టిన పాలిహౌస్ షెడ్లు నిర్మాణానికి ఎకరాకు ఆర్థికసాయం అందిస్తున్నారు. అన్ని ఉద్యానపంటలకు 70 నుంచి 90 శాఇతం వరకు రాయితీ వరకు డ్రిప్ మరియు తుంపర పరికరాలను నీటి వసతి ఉన్న ప్రతి రైతుకు అందిస్తున్నారు. జామ, దానిమ్మకు, బొప్పాయి, అరటి పంటలపై రైతులు ఎక్కువగా ఆసక్తి కనబరుస్తూ ఆధునిక వ్యవసాయ పద్ధతులు అనుసరిస్తుండడంతో ఈ ప్రాంతంలో ఉద్యానపంటలు ఎక్కువగా సాగు చేస్తున్నారు.

ఉద్యానపంటల రాయితీలపై ఉద్యానవన శాఖాధికారి శ్రీనివాసరెడ్డి వివరణ కోరగా, గత ఏడాదికి సంబంధించి రైతులకు రాయితీలు అందాయని, ఈ ఆర్థిక సంవత్సరానికి మళ్లీ దరఖాస్తు చేసుకుంటే అందజేస్తామని తెలిపారు.


నాగులకుంట్లలో బొప్పాయి తోటలను పరిశీలిస్తున్న ఉద్యానశాఖాధికారి శ్రీనివాసరెడ్డి


మల్చింగ్ పద్ధతిలో ఉద్యానవన పంటల సాగు


డ్రిప్ ఇరిగేషన్ ద్వారా అరటి సాగు చేసిన దృశ్యం


ఉద్యానపంటలకు రైతులు ఏర్పాటు చేసుకున్న నీటి కుంటలు

ఆర్టీసీ ఔట్ సోర్సింగ్ కార్మికులను ఆప్కాస్‌లో కలపండి


ఆర్టీసీ చైర్మన్‌కు వినతి పత్రం అందజేస్తున్న కార్మికులు

కడప మారుతీనగర్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీలో వివిధ విభాగాలలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ కార్మికులను ఆప్కాస్‌లో కలపాలని ఆర్టీసీ ఔట్ సోర్సింగ్ అసోసియేషన్ రాష్ట్ర ఉప ప్రధానకార్యదర్శి గంగాంజనేయులు ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం ఆర్టీసీ ఔట్ సోర్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విజయవాడలో ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణను కలిసి వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆర్టీసీలో సుమారు 8 వేల మంది ఔట్ సోర్సింగ్ కార్మికులు పనిచేస్తున్నారని.. వీరందరికీ జీతాలు సక్రమంగా చెల్లించడం లేదన్నారు. ఆర్టీసీ యాజమాన్యమే నేరుగా బ్యాంక్ అకౌంట్ ద్వారా జీతాలు చెల్లించేలా చూడాలన్నారు. విధుల్లో వుండే కార్మికుడికి ప్రమాదవశాత్తు ఏదైనా జరిగితే సంబంధిత ఆర్టీసీ డిస్పెన్సరీ హాస్పిటల్‌లో వైద్యం అందేలా చూడాలన్నారు. ఇందుకు చైర్మన్ స్పందించి త్వరితగతిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఆర్టీసీ ఔట్ సోర్సింగ్ అసోసియేషన్ కోశాధికారి పి.సుధీర్‌కుమార్, ఉపాధ్యక్షుడు గజపతి, అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.

ఈ డీఈఓ మాకొద్దు

- ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డికి ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక వినతి


ఎమ్మెల్సీకి వినతిపత్రం సమర్పిస్తున్న ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక ప్రతినిధులు

కడప ఎడ్యుకేషన్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయుల మనోభావాలు దెబ్బతినేవిధంగా డీఈఓ మీనాక్షి ప్రవర్తిస్తున్నారని.. తక్షణం ఆమెను ప్రభుత్వానికి సరెండర్ చేయాలని ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక ప్రతినిధులు డిమాండ్ చేశారు. లేకుంటే మూకుమ్మడిగా క్యాజువల్ లీవ్ పెట్టేందుకు సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. ఈ మేరకు సోమవారం కడప ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డికి వారు వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి అంటే గౌరవం లేని.. ఉపాధ్యాయులు, లెసన్ ప్లాన్ అంటే తెలియని డీఈవోని వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. ఆమె మాట్లాడే విధానాన్ని వివరించారు. ఉపాధ్యాయుల ఆత్మగౌరవం కాపాడుకోవడానికి ఉద్యమ కార్యచరణ రూపొందిస్తామన్నారు. ఎమ్మెల్సీ స్పందిస్తూ విద్యాశాఖ మంత్రి లోకేష్ దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరిస్తానన్నారు. కార్యక్రమంలో ఐక్యవేదిక నాయకులు వెంకటశివారెడ్డి, రామమూర్తి, బాలగంగిరెడ్డి, ఇలియాస్ బాష, ఖాదర్ బాష, కొండారెడ్డి, లెక్కల జమాల్‌రెడ్డి, రామాంజనేయరెడ్డి, అబ్దుల్లా, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

రాజంపేటలో పట్టపగలే చోరీ


బీరువాను పగులగొట్టి చిందరవందరగా పడేసిన వస్తువులు

రాజంపేట టౌన్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సాయినగర్‌లో పట్టపగలే ఇంటి తలుపులు పగులగొట్టి 15 తులాల బంగారం, నగదు చోరీ చేశారు. ప్రభుత్వ ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న నాగరాజు, లక్ష్మీ సోమవారం విధులకు వెళ్లి వచ్చేసరికి తలుపులు పగులగొట్టి ఉండడం గమనించా రు. పడక గదిలో ఉన్న బీరువాలోని 15 తులాల బంగారం, నగదు చోరీ చేసినట్లు గుర్తించారు. రాజంపేట మన్నూరు పోలీసులకు సమాచారం అందించడంతో సీఐ మహ్మద్‌అలీ, హెడ్‌కానిస్టేబుల్ నందకుమార్, సిబ్బంది ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం


రోడ్డుపై బోల్తాపడిన ట్రాక్టర్

చక్రాయపేట, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మారెళ్లమడక గ్రామ సమీపాన సోమవారం కట్టెల ట్రాక్టర్ బోల్తా పడింది. అయితే అదృష్టవశాత్తు ప్రమాదం తప్పింది. వివరాల్లోకెళితే .... బొగ్గలబట్టీ కోసం చక్రాయపేట నుంచి వేంపల్లె వైపు ట్రాక్టర్ కట్టెలు వేసుకొని వెళ్తుండగా మారెళ్లమడక బస్‌స్టాప్ వద్ద వేగం అదుపుకాక రాయచోటి-వేంపల్లె మెయిన్ రోడ్డులో బోల్తాపడింది. అప్పుడే ఆర్టీసీ బస్ వస్తుండగా డ్రైవర్ చాకచక్యంతో తప్పించడంతో ప్రమాదం జరగలేదు. కానీ ట్రాక్టర్ డ్రైవర్‌కు ఎలాంటి గాయాలు కాలేదు. హైవే కావడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

మేకలు మేపుకోవడానికి వెళ్లి వ్యక్తి అదృశ్యం

సికెదిన్నె, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): మేకలు మేపుకోవడానికి వెళ్లిన బ్రహ్మయ్య అనే వ్యక్తి తిరిగి ఇంటికి రాలేదని.. కుటుంబ సభ్యులు సికెదిన్నె పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసుల వివరాల మేరకు.. చింతకొమ్మదిన్నె మండలం పెద్దకాంపల్లె గ్రామానికి చెందిన బ్రహ్మయ్య మూడు రోజుల క్రితం రోజుమాదిరిగానే మేకలు మేపుకోవడానికి కొండప్రాంతానికి వెళ్లాడు. అయితే మేకలు తిరిగి ఇంటికి వచ్చినా బ్రహ్మయ్య ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు అతని ఆచూకీకోసం అనేక చోట్ల గాలింపు చర్యలు చేపట్టినప్పటికి కనిపించలేదు. దీంతో సోమవారం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

చెట్టుకు ఉరి వేసుకొని రైతు ఆత్మహత్య

బి.కొత్తకోట, జనవరి 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని గుమ్మసముద్రం పంచాయతీ గుడ్లవారిపల్లెకు చెందిన సంజీవరాజు(46) అనే రైతు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. 16 ఏళ్ల క్రితం తనభార్య చనిపోవడంతో పాటు, 10 ఏళ్ల నుంచి వాయిసంబంధిత(ఫిట్స్)తో బాధ పడుతున్న సంజీవరాజు జీవితంపై విరక్తి చెంది బలవన్మరణానికి పాల్పడినట్లు తెలుస్తోంది. కాగా సంజీవరాజు మరణ వార్త తెలియగానే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని సమీక్షించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మదనపల్లి ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతుడి కుమారుడు గోపాళ్యం హరీష్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ జవన్‌గంగాధర్ బాబు పేర్కొన్నారు.

భూ వివాదంలో తమ్ముడిపై అన్న దాడి


గాయపడిన తమ్ముడు శంకర

నిమ్మనపల్లి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): తండ్రి సంపాదించిన ఆస్తిని పంచుకొనే క్రమంలో తోడ బుట్టిన తమ్ముడిపై కొడవలితో అన్న దాడి చేసిన సంఘటన చోటు చేసుకొంది. మండంలోని ముష్టూరు పంచాయతీ యర్రప్పగారిపల్లెకు చెందిన చెండ్రాయప్ప కుమారుడు శంకర(45)కు అతని అన్న గుర్రప్పకు ఆస్తి విషయంలో తగాదా ఉంది. ఈ నేపధ్యంలో శంకర ఆదివారం రాత్రి బహిర్భూమికి పెద్దవంక వద్దకు వెళ్లగా అప్పటికే కాపుకాచి ఉన్న అన్న గుర్రప్పతో పాటు మరో ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు కొడవళ్లతో దాడి చేశారు. దీంతో శంకర కేకలు వేయడంతో గ్రామస్తులు రాగా.. గుర్రప్పతో పాటు ఇద్దరు వ్యక్తులు పరారయ్యారు. గాయపడిన శంకరను 108 సాయంతో మదనపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు గుర్రప్పపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ జిలానీబాషా తెలిపారు.

రీసర్వేపై రైతులు పూర్తిస్థాయిలో సంతృప్తి చెందాలి

- డీఎస్ఎల్‌వో కె.మురళీక్రిష్ణ



శివాలపల్లెలో రీసర్వేపై అవగాహన ర్యాలీ

చెన్నూరు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 9 నుంచి చేపడుతున్న రీసర్వేపై రైతులు పూర్తి స్థాయిలో సంతృప్తి చెందాలని జిల్లా భూసర్వే అధికారి కె.మురళీక్రిష్ణ అన్నారు. మండలంలోని శివాలపల్లె గ్రామాన్ని రీసర్వేకు సంబంధించి పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసింది. సోమవారం గ్రామంలో రైతులకు రీసర్వేపై అవగాహన కల్పించే విధంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్ఎల్‌వో మాట్లాడుతూ రీసర్వే ఎలాంటి వివాదాలు ఆరోపణలకు అవకాశం లేకుండా నిర్వహించాలన్నారు. ప్రతి రైతు ఈ రీసర్వే వల్ల తన భూమిపరంగా పూర్తి స్థాయిలో సంతృప్తి చెందాలన్నారు. రీసర్వే చేపట్టే ముందు ప్రతి రైతుకు సమాచారం అందాలని.. తద్వారా రైతులు తమ భూముల వద్ద ఉండి సమస్యలు పరిష్కరించుకోవాలన్నారు. అనంతరం మండల అధికారులతో సమావేశం నిర్వహించి రీసర్వేపై పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. అలాగే ఈ నెల 9న గ్రామసభ నిర్వహించాలని ఆ సభకు రైతులు, ప్రజలు తప్పక హాజరయ్యేలా చూడాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దారు సరస్వతి, మండల సర్వేయరు సోమశేఖర్, సర్వే డీటీ అర్చన, డీటీ వెంకటరమణ, ఆర్‌ఐ కౌశిక్, వీఆర్వో వెంకటసుబ్బయ్య, సచివాలయ సర్వేయర్లు శివారెడ్డి, తేజా, ఆరిఫ్, రామచంద్ర, పవన్ పాల్గొన్నారు.

కోడిపందాల నిర్వహణ చట్టరీత్యా నేరం : జేసీ


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జాయింట్ కలెక్టర్ అదితిసింగ్

కడప కలెక్టరేట్ జనవరి 6 (ఆంధ్రజ్యోతి) కోడి పందేలు నిర్వహించడం, పాల్గొనడం చట్టరీత్యా నేరమని జాయింట్ కలెక్టర్ అదితిసింగ్ పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని సభాభవనంలో ప్రజా వినతుల పరిష్కార వేదికలో కోడి పందేలు నిర్వహించుట చట్టరీత్యా నేరం అనే గోడ పత్రాన్ని ఆవిష్కరించారు. ఈసందర్భంగా జేసీ మాట్లాడుతూ కోడి పందాలు నిర్వహించుట జీవ జంతు సంరక్షణ చట్టం సెక్షన్ 34/1960, మరియు సెక్షన్ 1/1974 ప్రకారం చట్టరీత్యా నేరమన్నారు. అందులో పాల్గొన్న వారితో పాటు ఏ స్థలంలో నిర్వహిస్తారో వారికి కూడా వర్తిస్తుందన్నారు. కోడి పందేలు నిర్వహించే వారు 144 సీఆర్‌పీసీ ప్రకారం శిక్షార్హులు అన్నారు. జిల్లా రెవెన్యూ అధికారి విశ్వేశ్వరనాయుడు, పశుసంవర్థకశాఖ జాయింట్ డైరెక్టర్ ఎన్.శార దమ్మ, వ్యవసాయశాఖ జేడీ నాగేశ్వరరావు, జడ్పీ సీఈవో ఓబులమ్మ, అధికారులు వెంకటరమణయ్య, లీలా స్వర్ణ తదితరులు పాల్గొన్నారు.

హమ్మయ్య.. గుంతలు పూడ్చుతున్నారు

- ప్రయాణికులకు కాసింత ఊరట
- జిల్లా సరిహద్దు నుంచి రోడ్డు పనులు ప్రారంభం


రైల్వేకోడూరు మండలం కుక్కలదొడ్డి వద్ద నుంచి రోడ్డు పనులు చేస్తున్న దృశ్యం

రైల్వేకోడూరు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): రాజంపేట-రేణిగుంట రోడ్డులో గుంతలతో ప్రయాణికులు అనేక ఇబ్బందులు పడేవారు. గుంతలను తప్పించబోయి ప్రమాదాలు జరిగి కొందరు ప్రాణాలు కోల్పోగా చాలా మంది గాయపడి ఆస్పత్రుల పాలయ్యారు. ఇటీవల కురిసిన వర్షాలకు రైల్వేకోడూరు-తిరుపతి, రాజంపేట-రైల్వేకోడూరు వైపు ప్రధాన రహదారి గుంతలు పడి పూర్తి స్థాయిలో దెబ్బతింది. దీంతో ప్రయాణికులు తీవ్రంగా ఇబ్బందులు పడేవారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో రోడ్ల గురించి పట్టించుకున్న పాపాన పోలేదు. కూటమి ప్రభుత్వం దెబ్బతిన్న రోడ్లను సంక్రాంతిలోగా పూర్తి చేయాలన్న లక్ష్యంతో పనులు చేస్తోంది. సోమవారం రైల్వేకోడూరు-తిరుపతి సరిహద్దు నుంచి ప్రధాన రహదారిలో పనులను నేషనల్ హైవే అథారిటీ అధికారులు ప్రారంభించారు. గుంతలను పూడ్చి తారు రోడ్డు వేస్తున్నారు.

అంతర్‌జిల్లాల క్రికెట్ మ్యాచ్‌లు ప్రారంభం

- తొలి మ్యాచ్‌లో సత్తా చాటిన కడప, చిత్తూరు జట్లు


తాహీర్(కడప) 54 నాటౌట్, ధనుష్ (చిత్తూరు) 110 పరుగులు, లిఖిత్ ఇరగంరెడ్డి (చిత్తూరు) 99 పరుగులు

కడప స్పోర్ట్స్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని యువ క్రీడాకారులను మరింత ప్రోత్సహించాలనే ధ్యేయంతో వివిధ టోర్నమెంట్స్ కడపలో నిర్వహిస్తున్నట్లు జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి అవ్వారు రెడ్డి ప్రసాద్ వెల్లడించారు. ఆ మేరకు ఈనెల 6 నుంచి 12వ తేదీ వరకు కడపలో ఏసీఏ అండర్-12 బాలుర అంతర్‌జిల్లాల క్రికెట్ మ్యాచ్‌లు చేపడుతున్నామన్నారు. ఇందులో భాగంగా సోమవారం జరిగిన రెండు వేర్వేరు మ్యాచ్‌లలో కడప, చిత్తూరు జట్లు విజయం సాధించాయి.

36 పరుగులతో కడప జట్టు విజయం

నగర రిమ్స్ సమీప ఏసీఏ క్రికెట్ స్టేడియంలో కడప-అనంతపురం జట్ల మధ్య సాగిన మొదటి మ్యాచ్‌లో టాస్ నెగ్గిన కడప జట్టు బ్యాటింగ్‌కు దిగి 35 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 166 పరుగులు చేసింది. ఇందులో తాహీర్ 54 పరుగులతో నాటౌట్‌గా క్రీజ్‌లో నిలిచారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన అనంతపురం జట్టు 29.2 ఓవర్లలో 135 పరుగులకు ఆలౌట్ అయ్యింది. దీంతో కడప జట్టు 31 పరుగులతో విజయం సాధించింది.

165 పరుగుల తేడాతో చిత్తూరు ఘన విజయం

కేఓఆర్‌ఎం మైదానంలో చిత్తూరు-కర్నూలు జట్ల మధ్య జరిగిన మరో మ్యాచ్‌లో టాస్ నెగ్గిన చిత్తూరు జట్టు బ్యాటింగ్ చేపట్టి నిర్ణీత 35 ఓవర్లలో కేవలం 3 వికెట్ల నష్టానికి 250 పరుగుల భారీ స్కోర్ సాధించింది. ఇందులో ధనుష్ 110 పరుగులు చేయగా.. లిఖిత్ ఇరగంరెడ్డి 99 పరుగులు చేశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన కర్నూలు జట్టు 22 ఓవర్లలో 85 పరుగులకే కుప్పకూలింది. దీంతో చిత్తూరు జట్టు 165 పరుగుల భారీ స్కోర్ తేడాతో విజయం సాధించింది.

మాసాపేటలో ఆరోగ్య కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న మాసాపేట శివ తదితరులు

కడప మారుతీనగర్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ప్రజల ఆరోగ్యాన్ని కాపాడేందుకు శ్రమిస్తున్న పారిశుధ్య కార్మికుల ఆరోగ్య పరిరక్షణకు మాసాపేటలో ప్రత్యేక ఆరోగ్య కేంద్రం, మరుగుదొడ్లను ఏర్పాటు చేయాలని టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాసాపేట శివ ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం టీఎన్ఎస్ఎఫ్, ఎన్ఆర్ఐ మైనార్టీ ఉపాధ్యక్షుడు షేక్ రహ్మతుల్లా ఆధ్వర్యంలో కడప మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ మనోజ్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. టీడీపీ ఎస్సీసెల్ నాయకులు వి.ఆనందరావు, డి.ప్రభాకర్, టీఎన్ఎస్ఎఫ్ నగర అధ్యక్షుడు అనిల్, జిల్లా ఉపాధ్యక్షుడు లోకేష్‌కుమార్ పాల్గొన్నారు.

'తరగతులు నిర్వహించని బీఈడీ కళాశాలలను రద్దుచేయాలి'

కడప ఎడ్యుకేషన్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): తరగతులు నిర్వహించని బీఈడీ కళాశాలలను రద్దుచేయాలని ఏబీవీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మల్లికార్జున డిమాండ్ చేశారు. సోమవారం వైవీయూ ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం వీసీ ప్రొఫెసర్ కృష్ణారెడ్డికి వారు వినతి పత్రం సమర్పించారు. జిల్లా కన్వీనర్ మాణిక్యరాజ్, యూనివర్సిటీ ప్రెసిడెంట్ హనీష్, ఉపాధ్యక్షులు జావీద్, పుల్లయ్య, అరుణ్, చిన్న పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములను కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోండి

● టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పార్థసారధిరెడ్డి

పులివెందుల, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వంలో ప్రభుత్వ భూములను కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పేర్ల పార్థసారధిరెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. గత ప్రభుత్వంలో బడా నాయకులుగా చలామణి అయిన వారు భూకబ్జాలను ప్రోత్సహించారన్నారు. గత ప్రభుత్వంలో అక్రమాలు వెలుగులోకి రావాల్సి ఉందన్నారు. ఎటువంటి ఉపేక్ష లేకుండా చెరువులు, గుట్టలు, పొరంబోకు, తోపు, చుక్కల భూమి ఇలా అన్ని రకాల భూములను ఆక్రమించారన్నారు. ఒక ఉద్దండుడు 295/1, 295/3, 295/5, 295/8, 296 సర్వేనెంబర్లలో గల పొరంబోకు భూమిని, అలాగే రాళ్లగుట్టలు, చుక్కల భూములను కలిపి కబ్జా చేశారన్నారు. ఇందులో వెంచర్లు వేసి లేఔట్లు వేశారన్నారు. పులివెందుల సమీపంలోని వెలమవారిపల్లె, ఎర్రగుడిపల్లెలో ప్రభుత్వ భూమిని సునాయాసంగా కబ్జా చేసి వారి అదుపులో పెట్టుకున్నారన్నారు. 99, 101, 215, 216, 113, 169, 164 సర్వే నెంబర్లకు సంబంధించి ఆర్డీఓకు ఫిర్యాదు చేశామన్నారు. తప్పు చేసిన వారి పట్ల కఠినంగా వ్యవహరించాలన్నారు. కానీ ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లిన వారు మీనవేషాలు లెక్కించడం ఆశ్చర్యానికి గురిచేస్తోందన్నారు. గత ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు ఆ నాయకులు వారి బినామీ పేర్లపై రికార్డుల్లో భూములు ఎక్కించుకున్నారన్నారు. ప్రభుత్వ భూమి కాబట్టి అడిగేవారు లేరని తమ ఇష్టానుసారంగా కబ్జాలు చేశారన్నారు. ఈ విషయాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెళ్లి తగిన గుణపాఠం చెబుతామన్నారు. ఆక్రమించిన భూములను ప్రభుత్వం వెనక్కి తిరిగితీసుకొని ఆ భూముల్లో బోర్డులు ఏర్పాటుచేసేదాకా పోరాడుతామన్నారు.

సమస్యలు త్వరగా పరిష్కరించాలి: ఆర్డీవో



మాట్లాడుతున్న ఆర్డీవో జాన్ ఇర్విన్

కమలాపురం రూరల్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన సమస్యలను త్వరగా పరి ష్కరించాలని ఆర్డీవో జాన్ ఇర్విన్ అధికారులను ఆదేశించారు. సోమవారం తహసీల్దారు కార్యాలయ ఆవరణంలో తహసీల్దారు శివరామిరెడ్డి అధ్యక్షతన రెవెన్యూ అధికారుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆ యన మాట్లాడుతూ కమలాపురం మండలంలో జరిగిన రెవెన్యూ సద స్సుల్లో అధికంగా అర్జీలు వచ్చాయని, అందులో ఎక్కు వ శాతం రీసర్వేలో జరిగిన పొరపాట్లే ఉన్నాయన్నారు. ఆ అర్జీల పరిష్కారానికి ప్రతి వీఆర్వో కృషి చేయాలన్నారు. దాదాపు 120 అర్జీలు వచ్చాయని, బాధితులకు వివరించి అర్జీలు పరిష్కారం అయ్యేవిధంగా చూడాలన్నారు. ఏ అధికారీ అర్జీదారులను తమ చుట్టూ తిప్పుకోవద్దని, ఒకసారి వచ్చిన వ్యక్తిని మ రోసారి రాకుండా చూడాలని తెలిపారు. ఈ ప్రాంతంలో ఎక్కువ భాగం రీసర్వే జరిగింది కాబట్టి వాటిపై ఎక్కువ అర్జీలు వచ్చాయన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దారుతో పాటు మండల సర్వేయరు, వీఆర్వోలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ముగ్గురు సీఐల బదిలీ

కడప క్రైం, జనవరి 6: కడప జిల్లాలో పనిచేస్తున్న ముగ్గురు సీఐలను బదిలీ చేస్తూ కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్ ఉత్తర్వులు జారీ చేశారు. డీసీఆర్బీలో పనిచేస్తున్న డి.భాస్కర్‌రెడ్డిని కడప స్పెషల్ బ్రాంచ్-2కు, కడప వీఆర్‌లో ఉన్న వెంకటకుమార్‌ను కడప డీసీఆర్బీకి, కడప వీర్‌లో పనిచేస్తున్న వేణుగోపాల్‌ను కడప ఎస్సీ, ఎస్టీ సెల్‌కు బదిలీ చేశారు.

రంగనాథ స్వామి ఆలయ అభివృద్ధికి కృషి: ఎమ్మెల్సీ



మొక్కలు నాటుతున్న ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి

పులివెందుల టౌన్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) :రంగనాథస్వామి ఆలయ అభివృద్ధికి ప్రభుత్వ పరంగా కృషి చేస్తామని ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. ధనుర్మాసాన్ని పురస్కరించుకుని సోమవారం రంగనాథ స్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన ఆలయ ప్రాంగణంలో మొక్కలు నాటారు. అలాగే ఆలయ పరిసరాలను పరిశీలించి వివరాలను ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ వెంకటరమణను అడిగి తెలుసుకున్నారు. ఆలయంలో నిలిచిపోయిన అభివృద్ధి పనులు, ఇతర కార్యక్రమాల గురించి ఎమ్మెల్సీకి వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ రంగనాథ స్వామి ఆలయం ఎంతో మహిమాన్వితమైనదని, నిలిచిపోయిన అభివృద్ధి పనులు కొనసాగిస్తామన్నారు. అంతకు ముందు ఆలయ ప్రధాన అర్చకులు సోమేపల్లి కృష్ణరాజేశ్‌శర్మ, గిరిధరశర్మలు వేదమంత్రాలు, పూర్ణకుంభంతో స్వాగతం తీర్థప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మె ల్సీ వెంట గుప్తా మెడికల్ అధినేత మేడం దినేష్‌కుమార్, డాక్టర్ ఆర్ఎస్ఎస్ఆ రీసెర్చ్ ఫౌండేషన్ ఛైర్మన్ శివశంకర్, శ్రీరంగనాధ ట్రస్టు సీఈవో అల్లం రంగనాయకులు, టీడీపీ నాయకులు టైలరు శివారెడ్డి పాల్గొన్నారు.

తేనెటీగల పరిశ్రమపై శిక్షణ



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ శ్రీనివాసులు

పులివెందుల టౌన్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : తేనెటీగల పరిశ్రమపై శిక్షణ ఇస్తున్నట్లు పులివెందుల ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.శ్రీనివాసులు తెలిపారు. సోమవారం జువాలజీ డిపార్ట్‌మెంట్ విద్యార్థులకు తేనెటీగల పెంపకం వల్ల కలిగే ప్రయోజనాలు, వాటి పెంపకం విధానంపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ తేనెటీగలు ఎన్నిరకాలు, వాటిని ఉపయోగించే విధానాలు, తేనె ఎలా ఉత్పత్తి చేయవచ్చు, చెక్కబాక్సులను ఉపయోగించి వాటిలో మేలురకపు రాణి, కూలి, మగ తేనెటీగలను తీసుకుని ఉత్పత్తి చేయడం గురించి తెలిపారు. తేనెటీగలు, తేనె పట్టు, తేనె ఉపయోగాల గురించి సోదాహరణంగా వివరించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులకు సర్టిఫికెట్లు అందించారు. ఈ కార్యక్రమంలో వైస్‌ప్రిన్సిపాల్ ఎల్.సుధీర, డాక్టర్ సి.బాలనారాయణ, కోర్సు కోఆర్డినేటరు డాక్టర్ యు.శ్రీనిత, జనార్ధన పాల్గొన్నారు.

వృద్ధులకు అల్పాహారం, పండ్లు పంపిణీ

లింగాల, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): లింగాల టీడీపీ నాయకుడు దేవిరెడ్డి సంజీవరెడ్డి పుట్టినరోజు సందర్భంగా సోమవారం ఇప్పట్ల లీలావతి చారిటబుల్ ట్రస్టు అనాథ వృద్ధాశ్రమం, లింగాల దీనబంధు మానసిక వికలాంగుల ఆశ్రమంలో వృద్ధులకు, వికలాంగులకు సంజీవరెడ్డి తల్లి లక్ష్మీదేవి అల్పాహారం, స్వీట్లు, పండ్లు అందించారు. టీడీపీ కార్యకర్తలు సంజీవరెడ్డి ఇంటికి వెళ్లి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.

ప్రతి ఒక్కరూ పరిశుభ్రత పాటించాలి



మాట్లాడుతున్న డీన్ మాధవ

పులివెందుల, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ పరిశుభ్రత పాటించాలని ఆహార విజ్ఞాన శాస్త్ర, సాంకేతిక కళాశాల అసోసియేట్ డీన్ ఎం.మాధవ అన్నారు. సోమవారం పులివెందుల పరిధిలోని బ్రాహ్మణపల్లెలో ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరంలో భాగంగా స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. ప్రాథమిక పాఠశాల, జడ్పీ హైస్కూల్, అంగన్వాడీ ప్రీస్కూల్ పరిసర ప్రాంతాలలో చెత్తా చెదారాలను తొలగించారు. పరిశుభ్రతపై అవగాహన కోసం ర్యాలీ నిర్వహించారు. అనంతరం పండ్లు, కూరగాయల విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీని ప్రదర్శన నిర్వహించారు.అధ్యాపకులు డాక్టర్ కీర్తిరెడ్డి, ఎన్ఎస్ఎస్ అధికారులు డాక్టర్ జయమ్మ, డాక్టర్ నివేదిత, డాక్టర్ సాయిశ్రీనివాస్, డాక్టర్ జాకిర్ బాషా, కె.సుబ్బారెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇచ్చిన మాటను నిలబెట్టుకున్న కూటమి ప్రభుత్వం

వేంపల్లె, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఇచ్చిన మాట నిలబెట్టుకుందని బీజేపీ వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు దొంతు సుమన్ అన్నారు. ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్‌గా ప్రమాణ స్వీకారం చేసిన కె.వెంకటసుబ్బయ్యను విజయవాడలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గాలి హరిప్రసాద్, నరేష్‌కుమార్, గాడి భాస్కర్, శ్రీనివాసులరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్పీలకు పెండింగ్ వేతనాలు చెల్లించాలి



కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తున్న ఆర్పీలు

కడప సెవెన్ రోడ్స్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ మెప్మాలో పనిచేస్తున్న ఆర్పీలకు పెండింగ్‌లో ఉన్న వేతనాలు ఇవ్వాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు జి.వేణుగోపాల్, ఎల్.నాగసుబ్బారెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం కడప కలెక్టర్ కార్యాలయం వద్ద ఆర్పీల అసోసియేషన్ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నిరసన దర్నా నిర్వహించారు. అనంతరం జిల్లా జేసీకి వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా డిప్యూటీ జనరల్ సెక్రెటరీ కేసీ బాదుల్లా, ఆర్పీ పాల్గొన్నారు.

పెన్షనర్ల సంఘం కార్యాలయానికి
స్థలం మంజూరు చేయండి

కడప కలెక్టరేట్, జనవరి 6(ఆంధ్రజ్యోతి): పెన్షనర్ల సంఘం కార్యాలయానికి స్థలం కేటాయించాలని కడప తహసీల్దారు నారాయణరెడ్డికి ఏపీ ప్రభుత్వ పెన్షనర్ల సంఘం సభ్యులు విన్నవించారు. ఈ సందర్భంగా ఆ సంఘ ప్రధాన కార్యదర్శి రామ్మూర్తి నాయుడు మాట్లాడుతూ ప్రభుత్వ పెన్షనర్ల సంఘ కార్యాలయానికి 2.5 సెంట్ల స్థలం మంజూరు చేయాలని విన్నవించారు. అందుకు స్పందించిన తహసీల్దారు సహకరిస్తామన్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోశాధికారి నూనె నాగేష్, అసోసియేట్ అధ్యక్షుడు రాధాకృష్ణ, ఉపాధ్యక్షుడు తుపాకుల నారాయణ, సుబ్బరాయుడు, శ్రీనివాసులు, సుబ్బారెడడ్డి, మల్లయ్య, సుభాన్, చలపతి పాల్గొన్నారు.

11న వాలీబాల్ టోర్నమెంటు

పులివెందుల టౌన్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : పులివెందుల పట్టణంలోని వైఎస్ఆర్ ఇంటిగ్రేటెడ్ స్పోర్ట్స్ అకాడమీ క్రీడా మైదానంలో నెహ్రూ యువ కేంద్రం, ఎస్‌సీఏ‌ఆర్ మేనేజింగ్ డైరెక్టరు చంద్రశేఖర్‌రెడ్డి సంయుక్త సహకారంతో స్నేహిత అమృతహస్తం సేవా సమితి ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాల్లో భాగంగా నియోజకవర్గస్థాయిలో వాలీబాల్ టోర్నమెంటు పోటీలు నిర్వహిస్తున్నట్లు స్నేహిత అమృతహస్తం సేవాసమితి అధ్యక్షుడు రాజు సోమవారం తెలిపారు. గెలుపొందిన టీమ్‌కు విన్నర్, రన్నర్ టీమ్‌లకు నగదు బహుమతి, ప్రశంసాపత్రాలతో పాటు మెమెంటోలు అందజేస్తామన్నారు. కావున పులివెందుల నియోజకవర్గంలోని వాలీబాల్ క్రీడాకారులు టీమ్‌ల వారీగా 9966509354కు సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని ఈ సందర్భంగా ఆయన కోరారు.

విజేతలకు బహుమతులు

కడప మారుతీనగర్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ కార్గో డోర్ డెలివరీ మాసోత్సవాలను (20-12-2024 నుంచి 19-1-2025 వరకు) పురస్కరించుకుని కార్గో డోర్ డెలివరీ బుక్ చేసుకున్న వారికి లక్కీడిప్ ద్వారా ఆర్టీసీ కడప డిపో అధికారులు ప్రోత్సాహక బహుమతులను అందజేస్తున్న సంగతి తెలిసిందే. అందులో భాగంగా సోమవారం స్థానిక ఆర్టీసీ కడప బస్టాండులో సంబంధిత కడప రీజనల్ మేనేజర్ పి. గోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో రెండవ లక్కీడిప్ నిర్వహించారు. ఇందులో ప్రథమ అస్సలాం (కడప), ద్వితీయ జనార్ధన్ (కడప) తృతీయ విజేతలుగా మోహన్ (కడప) ఎంపికయ్యారు. వీరికి కొత్తాస్ ప్రొడక్ట్స్ వారి సౌజన్యంతో సంబంధిత ప్రొడక్ట్ ఛైర్మన్ అభిరామ్ చేతులమీదుగా 1,000 రూపాయల విలువగల వస్తువులను బహుమతులుగా అందజేశారు. కార్యక్రమంలో ఆర్టీసీ కడప డిపో మేనేజర్ డిల్లేశ్వరరావు, డిప్యూటీ సిఎంఈ లక్ష్మీభాస్కర్, ఏటిఎం కమర్షియల్ జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

నిత్య పూజ కోనలో వసతులు కల్పించాలి

కడప కలెక్టరేట్, జనవరి 6(ఆంధ్రజ్యోతి): కడప జిల్లా సిద్ధవట మండలంలోని నిత్య పూకోనలో భక్తుల సౌకర్యార్థం కనీస వసతులు కల్పించాలని జాయింట్ కలెక్టర్ అదితిసింగ్‌కు శ్రీసుముకి అన్న పూర్ణేశ్వరీ సేవాసమితి సభ్యులు వెంకటకృష్ణయ్య, రామచంద్రమూర్తి, రామమూర్తి, సుబ్రమణ్యం, ఉపేంద్ర సోమవారం ప్రజా పిర్యాదుల స్వీకరణ కార్యక్రమంలో వినతి పత్రం అంద జేశారు. నగరంలోని పార్కులు, కూడళ్లను సుందరీరణకు తాము ముందుంటామని, తమ సేవలు సద్వినియోగం చేసుకోవాలని కమిషనరుకు ఆసంస్థ ప్రతినిధులు, తాళపత్ర గ్రంథ నిపుణుడు మునికుమార్ తదితరులు విన్నవించారు.

హెచ్‌ఎం శివమోహన్ సేవలు మరులేం

పెండ్లిమర్రి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ప్రధానోపాధ్యాయుడు శివమోహన్ సేవలు మరువలేమని జిల్లా ఉప విద్యాశాఖాధికారి రాజగోపాల్‌రెడ్డి కొనియాడారు. సోమవారం ఎగువపల్లె జిల్లా పరిషత్ హైస్కూల్‌లో శివమోహన్ పదవీవిమరణ కార్యక్రమం నిర్వహించగా డిప్యూటీ డీఈఓ రాజగోపాల్‌రెడ్డి హాజరై మాట్లాడారు. ఎంఈఓ సుజాత మాట్లాడుతూ శివమోహన్ పాఠశాలను అభివృద్ధి చేయడంలో విశేష కృషిచేశారని కొనియాడారు.

సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలి

● కడప మున్సిపల్ కమిషనర్ మనోజ్‌రెడ్డి



అర్జీలు స్వీకరిస్తున్న కమిషనర్ మనోజ్‌రెడ్డి

కడప ఎర్రముక్కపల్లె, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ప్రతి సమస్యనూ క్షేత్రస్థాయిలో పరిశీలించి నిర్ణీత సమయంలో పరిష్కరించాలని కడప మున్సిపల్ కమిషనర్ మనోజ్‌రెడ్డి అధికారులకు సూచించారు. సోమవారం కడప నగరం కార్పొరేషన్ వీడియో కాన్ఫరెన్స్ హాల్లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. అనంతరం ఆయన ఆమట్లాడుతూ కార్పొరేషన్ పరిధిలో 27 అర్జీలు వచ్చాయన్నారు. వాటిలో ఇంజనీరింగ్ విభాగం 12, టౌన్‌ప్లానింగ్ మూడు, పబ్లిక్ అండ్ హెల్త్ నాలుగుచ రెవిన్యూ 6, యూసీఐ రెండు వచ్చాయన చెప్పారు. ప్రతి అర్జీని పరిశీలించి సంబంధిత అధికారులకు పంపించామన్నారు. క్షేత్రస్థాయిలో పరిశీలించిన తర్వాతే వాటిని నిర్ణీత సమయంలో పరిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ కె.రాకేష్ చంద్రం, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ చంద్రశేఖర్, ఎస్ఈ చెన్నకేశవరెడ్డి, ఆర్వోలు, టౌన్ ప్లానింగ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఓఎన్జీసీ స్కాలర్‌షిప్ అందుకున్న విద్యార్థికి వీసీ ప్రశంసలు



విద్యార్థికి స్కాలర్‌షిప్‌ను అందిస్తున్న వీసీ కృష్ణారెడ్డి తదితరులు

కడప ఎడ్యుకేషన్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): యోగివేమన విశ్వవిద్యాలయం జియాలజీ శాఖ విద్యార్థి కె.ఇమ్మానుయేల్‌కు ఆయిల్ అండ్ నేచురల్ గ్యాస్ కార్పొరేషన్ (ఓఎన్జీసీ) నుంచి మెరిట్ స్కాలర్‌షిప్ మంజూరు అయింది. ఈ విద్యార్థికి ఉన్నత విద్య కొనసాగించేందుకు ఏడాదికి రూ.50 వేలు ఇవ్వనున్నారు. పేద కుటుంబం నుంచి వచ్చిన ఈ విద్యార్థి డిగ్రీలో 8.9, పీజీ మొదటి రెండు సెమిస్టర్‌లలో 9.0జీపీఏ సాధించి ప్రతిభను చాటారు. ఈ ఉపకార వేతనానికి జాతీయ స్థాయిలో దాదాపు 2వేల మంది దరఖాస్తు చేయగా ప్రతిభా ప్రాతిపదికన వైవీయూ క్యాంపస్ పీజీ కళాశాల జియాలజీ విద్యార్థి ఇమ్మానుయేల్ ఎంపిక కారవడం హర్షణీయమన్నారు. వీసీ ఆచార్య కె.కృష్ణారెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య పుత్త పద్మ, ప్రిన్సిపాల్ ఆచార్య రఘునాథరెడ్డి, భూగర్భశాస్త్ర విభాగాధిపతి వి.సునీత, ఆచార్య కె.రఘుబాబు, ఆచార్య ఎన్.జయరాజు, సహ ఆచార్యులు ఎస్.శ్రీనివాస్‌గౌడ్, అకడమిక్ కన్సల్టెంట్లు అభినందించారు. ఈ కార్యక్రమంలో వైవీయూ ప్రజా సంబంధాల విభాగం సంచాలకులు డాక్టర్ పి.సరిత పాల్గొన్నారు.

సంక్షేమ బోర్డును పునఃప్రారంభించాలి



నిరసన తెలియజేస్తున్న భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు

కడప సెవెన్‌రోడ్స్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డును పునఃప్రారంభించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్.నాగరాజుబ్బారెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం కడప కలెక్టర్ కార్యాలయం వద్ద ఏపీ బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ అనుబంధం జిల్లా సమితి ఆధ్వర్యంలో నిరాహార దీక్ష ప్రారంభించారు. వారు మాట్లాడుతూ గత ఎన్నికల్లో హామీ ఇచ్చి ఏడు నెలలు గడిచినా కూటమి ప్రభుత్వం బోర్డును ప్రారంభించలేదన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి లింగన్న, జిల్లా అధ్యక్షుడు బి.రామాంజనేయులు, జిల్లా డిప్యూటీ సెక్రటరీ శ్రీరాములు, జిల్లా ఆఫీస్ బేరర్స్ పీరయ్య, నాగేశ్వరరావు, మస్తాన్, బుజ్జి, హనుమంతు, రామలింగ, నరసింహ, బుజ్జి, బాలగంగన్న పాల్గొన్నారు.

సర్వే పూర్తి చేయని సిబ్బందిపై చర్యలు : ఎంపీడీవో

సింహాద్రిపురం, జనవరి 6(ఆంధ్రజ్యోతి): అన్ని గ్రామ సచివాలయాలలోని సిబ్బంది మంగళవారం సాయంత్రం లోపు ఇళ్ల జియో ట్యాగ్, పీపీసీఎస్, ఎమ్ఎస్ఎంఈ సర్వే తప్పకుండా పూర్తి చేయాలని, లేకుంటే కలెక్టర్ ఆదేశాల మేరకు క్రమశిక్షణ చర్యలు తప్పవని ఎంపీడీవో కృష్ణమూర్తి హెచ్చరించారు. సోమవారం హిమకుంట్ల, గురిజాల గ్రామ సచివాలయాలలో సర్వేపై ఎంపీడీఓ పరిశీలించారు.

డీఈవోను ప్రభుత్వానికి సరెండర్ చేసేందుకు సిఫార్సు చేయాలి

● ఆర్జేడీకి పీడీఎస్‌యూ వినతి



ఆర్జేడీ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న విద్యార్థి సంఘం నాయకులు

కడప ఎడ్యుకేషన్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): డీఈఓ మీనాక్షిని ప్రభుత్వానికి సరెండర్ చేసేలా సిఫారసు చే యాలని పీడీఎస్‌యు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.అంకన్న డిమాండ్ చేశారు. సోమవారం ఆర్జేడీ కార్యాలయంలో ఆర్జేడీ శామ్యూల్‌కు వినతి పత్రం అందించారు. ఉపాధ్యాయుల పట్ల డీఈఓ తీరును వివరించారు. పీడీఎస్‌యూ నగర నాయకుడు మనోజ్ పాల్గొన్నారు.

డీఈవోపై చర్యలు తీసుకోవాలి


● ఏఐఎస్‌బి, ఆర్ఎస్‌యూ, పీఎస్‌యూ



ఆర్జేడీ శామ్యూల్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న పీడీఎస్‌యూ ప్రతినిధులు

కడప ఎడ్యుకేషన్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల వేధింపులతో పాటు కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థలకు కొమ్ముకాస్తున్న కడప జిల్లా విద్యాశాఖాధికారిపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్‌బీ, ఆర్ఎస్‌యూ, పీఎస్ యూ నాయకులు ధ్వజమెత్తారు. సోమవారం ఆర్జేడీ కా ర్యాలయం ఎదుట ఏఐఎస్‌బీ, ఆర్ఎస్‌యూ, పీఎస్‌యూ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. వారు మాట్లాడుతూ డీఈఓ మీనాక్షి బాధ్యతలు తీసుకున్నప్పటి నుంచి వివాదాస్పదంగా వ్యవహరిస్తూ ఉపాధ్యాయులను ఇష్టమొచ్చినట్లు అసభ్య పదజాలంతో దూషిస్తూ మానసికంగా వేధిస్తున్నారనే ఆరోపణలపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

క్రీడలు సామరస్యంగా జరుపుకోవాలి : ఎస్ఐ



క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న ఎస్ఐ తిరుపాల్ నాయక్

వేంపల్లె, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ఒకరికొకరు సామరస్యం పెంపొందించుకునేలా క్రీడలు జరుపుకోవాలని ఎస్ఐ తిరుపాల్‌నాయక్ తెలిపారు. సంక్రాంతి సంబరాల్లో భాగంగా వేంపల్లె గాజులపేట వాసులు నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్‌ను సోమవారం ఎస్ఐ ప్రారంభించారు. ఉపాధి నిమిత్తం వివిధ ప్రాంతాల్లో ఉన్న వారు పండుగకు ఒక్కచోటికి చేరి క్రికెట్ టోర్నమెంట్‌లో పాల్గొనడం అభినందనీయమన్నారు. క్రీడల ద్వారా పేరు ప్రఖ్యాతలు లభిస్తాయని ఎస్ఐ తెలిపారు.

అధికారుల తప్పిదాలు..ప్రజలకు శాపాలు..!

● సర్వేనెంబర్‌ను నిషేధిత జాబితాలోకి చేర్చిన రెవెన్యూ అధికారులు ● ఎర్రగుంట్ల స్వప్న వీధిలోని ఇళ్లు, స్థలాల రిజిస్ట్రేషన్లకు బ్రేక్
● 6ఏళ్లుగా నరకయాతన ● అమ్మేందుకు లేదు-కొనేందుకు లేదు ● పదిరోజుల్లో పరిష్కరించకపోతే ఆత్మహత్యలే శరణ్యమంటూ...ఆవేదన

ఎర్రగుంట్ల, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): రెవె న్యూ అధికారుల తప్పిదాలు ప్రజలకు శాపాలుగా మారుతున్నాయి. పక్కా పట్టాలు గాఉన్నా, రిజిస్ట్రేషన్లు చేసుకున్నా, తాతలనాటి ఆస్తులైనా వారు చేసిన తప్పిదాలకు ఆస్తులను అవసరాలకు అమ్ముకునేందుకు లేదు, వారసత్వంగా మార్పిడిచేసేందుకు లేదు. దీంతో ప్రజలు తీవ్ర నరకయాతన అనుభవిస్తున్నారు. ఇలాంటివి అనేకం ఉన్నాయి. ఎర్రగుంట్లనగరపంచాయతీలోని స్వప్న వీధి సర్వే నెంబరు 289లో 2.40ఎకరాల భూమి వుంది. ఇందులో 30సెంట్లలో ప్రభుత్వ పాత నగరపంచాయతీ కార్యాలయం ఉంది. ఈ సర్వే నెంబరులో 2018 ఏప్రిల్ 16 వరకు రిజిస్ట్రేషన్లు అయ్యాయి. తరువాత కొంత కాలం వరకు ఎవరూ చేయించుకోలేదు. అయితే 2018 చివరిలో అమ్మకాలు, కొనుగోలు ప్రక్రియలో భాగంగా రిజిస్ట్రేషన్లు చేయించుకునే ప్రయ త్నాలు చేశారు. అయితే రిజిస్ట్రార్ కార్యాలయంలో ఈ సర్వేనెంబరు మొత్తం 22(ఏ) నిషేధిత జాబితాలో ఉందని రిజిస్ట్రేషన్లు చేసేందుకు కుదరదని చెప్పడంతో అసలు విషయం బయట పడింది. సుమారు వందిళ్లవరకు ఈ విస్తీర్ణంలో ఉన్నట్లు బాధితులు పేర్కొంటున్నారు. కోట్ల విలువ చేసే ఆస్తులను తాము అమ్ముకోలేక, కొన లేక ఇబ్బందులు పడుతున్నామంటున్నారు.

● కలెక్టర్‌కు విన్నవించినా....ఈవిషయంపై కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. అక్కడి నుంచి ఆర్డీవో కార్యాలయం, అది తిరిగి తహసీల్దార్ కార్యాలయానికే చేరింది. కానీ ఇక్కడి అధికారులు మాత్రం ఆ విషయాన్ని తేల్చక నానాబెడుతూ, ఎమ్మెల్యేస్థాయి వారు చెప్పినా బాధితులను తమ చుట్టూ తిప్పుకుంటూ ఈ పనిచేస్తే నాకేంటి లాభం అన్న రీతిలో కాలయాపన చేశారు. దీంతో ఆరేళ్లుగా బాధితులు తమ సొంత స్థలాలను, ఇళ్లను అమ్మేందుకు, వారసులకు ఇచ్చేందుకు వీలు కాక ఇబ్బందులు పడుతున్నారు. కొత్త ఇళ్లు నిర్మించుకుంటే బ్యాంకు లోన్లు ఇవ్వడంలేదు, కొందరు పిల్లల చదువుల కోసం ఇంటిని ష్యూరిటీ కింద పెట్టి లోన్లు తెచ్చుకోవాలన్నా కుదరడంలేదు. కొందరు అత్యవసర పనులకు అప్పులు తెచ్చుకుని వడ్డీలుకట్టలేక అమ్ము కోవాలనుకున్నా ఆరేళ్లుగా కుదరడంలేదని బాధితులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ ఇళ్ల, స్థలాల సర్వేనెంబర్‌ను నిషేధిత జాబితా నుంచి తొలగించి న్యాయం చేయాలని లేదంటే తమకు ఆత్మహత్యే శరణ్యమని మహిళా బాధితులు సైతం రెవెన్యూ సదస్సులో డీటీకి తేల్చి చెప్పారు.

● ఒకరిపై ఒకరు....సర్వే నెంబరు 489లో 2.40ఎకరాల స్థలంలో 30సెంట్లు పాత నగరపంచాయతీ కార్యాలయం ఉంది. అయితే ఆ స్థలంలో నగరపంచాయతీ కార్యాలయం ఉందని స్థానిక కమిషనర్ సంతకం చేసి ఇస్తే సరిపోతుందని రెవెన్యూ అధికారులు చెబు తున్నారు. అందులో నాలుగు సెంట్లు తక్కువ ఉందని అదెక్కడుందో రెవెన్యూ అధికారులే తేల్చాలని, అంతవరకు సంతకం చేయనని కమిషనర్ చెప్పారు. గతంలోనే దీన్ని సర్వే చేసి 30సెంట్లను సర్వే నెంబరు 489 నుంచి వేరు చేశారని మళ్లీ ఇప్పుడు సర్వే ఎందుకని ప్రస్తుత రెవెన్యూ అధికారులు పేర్కొంటు న్నారు. నగరపంచాయతీ వారు, రెవెన్యూ వారు ఒకరిపైనొకరు చెబుతూ సమస్యను పరిష్కరించడంలేదని బాధితులు పేర్కొంటున్నారు.

● కాగా ఈ విషయంపై డీటీ యామిని మాట్లాడుతూ స్వప్నవీధి సర్వేనెంబరు 489లో ఉందన్నారు. అయితే అదే సర్వే నెంబరులో 30సెంట్లలో పాత ఎర్రగుంట్లనగరపంచాయతీ కార్యాల యం కూడా ఉందని అది ఎప్పుడో డివిజన్ అయ్యిందన్నారు. అయితే ఈ సర్వే నెంబరును నిషేధిత జాబితాలోకి ఎందుకు చేర్చారో తెలియడంలేదన్నారు. రిజిస్ట్రేషన్లు కాకుండా ఎందుకు ఆపారో కూడా పరిశీలిస్తామన్నారు. పూర్తిగా పరిశీలించి వీలైనంత త్వరగా సమస్యను పరిష్కరించి బాధితులకు న్యాయంచేస్తామన్నారు.


డీటీకి వినతి పత్రాన్ని ఇస్తున్న బాధితులు (ఫైల్‌ఫొటో)

కేసీపీ ఫౌండేషన్ స్కాలర్‌షిప్‌లకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రొద్దుటూరు టౌన్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): కేసీ పుల్లయ్య ఫౌండేషన్ ఆ ధ్వర్యంలో ప్రతిభావంతులైన పేద విద్యార్థులు స్కాలర్‌షిప్‌ల కోసం దరఖా స్తులను ఆహ్వానించినట్లు ఆ ఫౌండేషన్ ఛైర్మన్ కె.అనిల్‌కుమార్ ఒక ప్రకట నలో తెలిపారు. 500 మంది పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లను అందజే స్తామని పేర్కొన్నారు. గత విద్యాసంవత్సరంలో 10వ తరగతి, ఇంటర్, పా లిటెక్నిక్, డిగ్రీ, ఇంజనీరింగ్, మెడిసిన్, పీజీ చదువుతున్న విద్యార్థులు 80 శాతంపైగా మార్కులు సాధించినవారు దరఖాస్తు చేసుకోవాలని సూచిం చారు. ఈనెల 7వ తేదీ నుంచి ఫిబ్రవరి 28వ తేదీలోపల కేసీ పుల్లయ్య ఫౌండేషన్.ఓఆర్‌జీ అన్న వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించా రు. వివరాలకు 9949516637, 08564253866 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

డోర్ డెలివరీ మాసోత్సవాల్లో భాగంగా లక్కీడ్రా


విజేతలను ప్రకటిస్తున్న డీఎం నిరంజన్

బద్వేలు రూరల్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : డోర్ డెలివరీ మాసోత్సవాల్లో భాగంగా లక్కీడిప్ ద్వారా ముగ్గురు విజేతలను ఎంపికచేసినట్లు ఆర్టీసీ డీఎం నిరంజన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏపీఎస్‌ఆర్టీసీ కార్గో ఆధ్వర్యంలో వినియోగదారులకు తమ వస్తువులను డోర్ డెలివరీ సౌకర్యాన్ని కల్పించడం జరిగిందన్నారు. మాసోత్సవాల్లో భాగంగా 6,13,19 తేదీల్లో డోర్ డెవలరీ బుక్‌చేసుకున్న వారికి లక్కీడిప్ ద్వారా విజేతలను ఎంపికచేసి బహుమతులను అందజేస్తామన్నారు. అందులో భాగంగా సోమవారం లక్కీడిప్ ద్వారా ముగ్గురు విజేతలను ఎంపిక చేశామన్నారు. మొదటి బహుమతి కె.ఎస్.జె.ఎస్.రావు, ద్వితీయ బహుమతి ఎన. ఈశ్వరమ్మ, తృతీయ బహుమతి డాక్టర్ ప్రశాంత్ దక్కించుకున్నారన్నారు. 13, 19 తేదీల్లో కూడా వినియోగ దారులకు లక్కీడిప్ తీయడం జరుగుతుందన్నారు.

కంపచెట్లను తొలగించండి

● సచివాలయాన్ని తనిఖీ చేసిన ఎంపీడీవో



ఖాజీపేట, జనవరి 6 (ఆంధ్రజ్యో తి): కంపచెట్లను తొలగించి గ్రా మాన్ని పరిశుభ్రంగా ఉండేలా చ ర్యలు తీసుకోవాలని ఎంపీడీవో దివిజ సంపతి అన్నారు. సోమ వారం మండల పరిధిలోని త్రిపు రవరం పంచాయతీ కార్యాలయా న్ని తనిఖీ చేశారు. అలాగే గ్రామంలో కలియతిరిగి ప్రజల సమస్యలు అడి గి తెలుసుకున్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో గల బావికి చుట్టూ ప్రహరీ ఏర్పాటు చేయడంతోపాటు గ్రామంలోని కంపచెట్ల ను తొలగించి మంచినీటి ట్యాంకును ఎప్పటికప్పుడు శుభ్రపరుస్తూ ప్రజల కు మంచినీటిని అందించాలని అన్నారు. సచివాలయాలకు వచ్చే ప్రజల స మస్యలు పరిష్కరించాలని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది హరినాథరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

27, 28 తేదీల్లో మెడికల్ పెన్షన్ల తనిఖీ

కొండాపురం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 27, 28 తేదీల్లో మండలంలో మెడికల్ పెన్షన్ల తనిఖీకి ప్రత్యేక వైద్యులను ప్రభుత్వం నియమించిందని ఎంపీడీవో నాగ ప్రసాద్ తెలిపారు. డాక్టర్ వెంకట భరత్ (బద్వేల్), డాక్టర్ సూర్యా నాయక్(కడప)తో కూడిన బృందం పెన్షన్లను తనిఖీ చేస్తారన్నారన్నారు. ప్రభుత్వం నెలనెలా అందజేసే రూ.15,000 మెడికల్ పెన్షన్లను వైద్యబృందం ఇంటింటికి వెళ్లి తనిఖీ చేస్తారన్నారు. మండలంలో 33 మెడకల్ పెన్షన్లు ఉండగా, రోజుకు 20 చొప్పున రెండు రోజుల పాటు పెన్షన్లను తనిఖీ చేస్తారని ఎంపీడీవో తెలిపారు.

ఏపీటీఎఫ్ కేలండర్, డైరీల ఆవిష్కరణ

ప్రొద్దుటూరు టౌన్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ 2025 నూతన ఆంగ్ల సంవత్సర కేలండర్, డైరీ, జీవోల సంపుటిని ఎంఈవో సావిత్రమ్మ ఆవిష్కరించారు. సోమవారం మండల విద్యాశాఖ అధికారి కార్యాలయంలో కేలండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్యాంసుందర్‌రెడ్డి , జిల్లా ప్రధాన కార్యద ర్శి శ్రీనివాసరెడ్డి, ప్రొద్దుటూరు మండల అధ్యక్షుడు సుబ్బయ్య, ప్రధాన కార్యదర్శి సయ్యద్‌బాష, బాబుల్‌రెడ్డి, సురేష్, ఖా జీమ్, దస్తగిరి, జయప్రతాప్, ప్రకాశం పాల్గొన్నారు.

'దేవదాయశాఖను రద్దు చేయాలి'

పోరుమామిళ్ల, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : దేవదాయశాఖను వెంటనే రద్దుచేయాలని విశ్వహిందూ పరిషత్ అధ్యక్ష, కార్యదర్శులు ఫణిరావు, శ్రీనివాసులరెడ్డి అన్నారు. సోమవారం వారు పాత్రికేయులతో మాట్లాడుతూ హిందువులు స్వయంగా నిర్మించుకున్న దేవాలయాలపై ప్రభుత్వం పెత్తనం ఏమిటని , హిందూదేవాలయాలపై ప్రభుత్వం పెత్తనం ఇక సహించేదే లేదన్నారు. దేవాలయాలు స్వతంత్రంగా నిర్మించుకోవడానికి దేవదాయశాఖను రద్దు చేసి దేవాలయ వ్యవస్థను హిందువులకు అప్పజెప్పాలన్నారు. విజయవాడలో జరిగిన హైందవశంఖారావానికి పోరుమామిళ్ల నుంచి దాదాపు ఏడు బస్సుల్లో 400మంది ప్రజలు వెళ్లడం జరిగిందన్నారు.

రేషన్ షాపులకు 29 దరఖాస్తులు

కలసపాడు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): కలసపాడు మండలం లోని తొమ్మిది రేషన్‌షాపులకు 29 దరఖాస్తులు వచ్చినట్లు మండల రెవెన్యూ అధికారి మధురవాణి సోమవారం తెలిపారు. ప్రభుత్వం ఇటీవల చెన్నుపల్లి, ఇ.తంబళ్లపల్లె, కలసపాడు, పుల్లారెడ్డిపల్లె, శంకవరం, పిడుగుపల్లె, సింగరాయపల్లె, తెల్లపాడు, ఎగువ రామాపురం చౌక దుకాణాలకు నోటిఫికేషన్ జారీ చేసింది. సోమవారం గడువు ముగిసేనాటికి 29 దరఖాస్తులు వచ్చినట్లు ఆమె తెలిపారు. దరఖాస్తులు పరిశీలించి ఈ నెల 11న రాత పరీక్ష , అనంతరం ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు.

ఆర్థిక సాయం అందజేత

అట్లూరు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కుంభ గిరి పంచాయతీ పరిధిలోని కోనేటిపల్లి ఎస్సీ కాలనీకి చెందిన జయరామయ్య మూడురోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలపాలు కావడంతో అతని వైద్యచికిత్స కోసం రూ.20 వేలు ఆర్థిక సాయాన్ని జయరామయ్య కుటుంబ సభ్యులకు కుంభగిరి టీడీపీ నాయకుడు రాజశేఖర్‌రెడ్డి సోమవారం అందించారు. ఈ కార్యక్రమంలో జేసీబీ సుబ్బారెడ్డి, మల్లెం కొండయ్య, పెంచలయ్య, పరశురాముడు, రత్నబాబు, బాబు, రాజేంద్ర కిశోర్, శివ, నాగరాజ, రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.

రైతులు తప్పనిసరిగా ఈ-క్రాప్ చేయించుకోవాలి

కొండాపురం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): రబీలో తాము సాగుచేసిన పంటలకు రైతులు తప్పనిసరిగా ఈ-క్రాప్ చేయించుకోవాలని ఏవో రామాంజులరెడ్డి తెలిపారు. స్థానిక రైతుసేవా కేంద్రంలో మండలం లోని రైతుసేవా కేంద్రం ఇన్‌చార్జీలతో సోమవారం సమావేశం నిర్వహించారు. రైతులు ఈ-క్రాప్ చేయించుకుంటేనే అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్, క్రాప్ ఇన్సూరెన్స్ వంటి పథకాలు వర్తిస్తా యన్నారు. అదేవిధంగా రైతులకు ప్రతిరైతుసేవాకేంద్రంలో కొరత లేకుండా ఎరువులు అందుబాటులో ఉండేలా చూడాలని ఏవో ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని రైతు సేవా కేంద్రాల సిబ్బంది పాల్గొన్నారు.

'వాల్మీకి బోయల సంక్షేమం కోసం పనిచేస్తా'


ప్రమాణ స్వీకారం చేస్తున్న నాగరాజు

ప్రొద్దుటూరు జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : వాల్మీకి బోయల సంక్షేమం అభివృద్ధి కోసం శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని వాల్మీకి బోయ కార్పొరేషన్ డైరెక్టర్ నల్లబోతుల నాగ రాజు పేర్కొన్నారు. సోమవారం విజవాడలోని బీసీ భవన్‌లో రాయదుర్గం ఎమ్మెల్యే కాల్వ శ్రీనివాసులు, రాష్ట్ర వాల్మీకి బోయ కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ కప్పట్రాళ్ల బుజ్జమ్మ ఆధ్వర్యంలో డైరెక్టర్‌గా నల్లబోతుల నాగరాజు ప్రమాణ స్వీకారం చేశారు.

మండలంలో గ్రామాల అభివృద్ధికి కృషి


ప్రజలతో మాట్లాడుతున్న అధికారులు

బద్వేలు రూరల్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గ్రామాల అభివృద్ధికి సచివాలయ సిబ్బందిని కలుపుకొని ఎంపీడీఓలు కృషి చేయాలని డివిజనల్ అభివృద్ధి అధికారి శ్రీనివాసులు కోరారు. సోమ వారం ఎంపీడీఓ మల్లీశ్వరితో కలసి వీరపల్లె పంచాయితీలోని ఎస్టీకాలనీలైన వెంకటాద్రినగర్, రామాంజనేయనగర్‌ను సందర్శించా రు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్టీకాలనీల్లో చదివే పిల్లలను కచ్చితంగా పాఠశాలలకు పంపాలని కోరారు.

సాఫీగా సాగిన మండల సర్వసభ్య సమావేశం

దువ్వూరు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): దువ్వూరు మండల పరిషత్ స ర్వసభ్య సమావేశం సోమవారం కార్యాలయ ఆవరణంలోని సభాభవ నంలో సాఫీగా సాగింది. అన్నిశాఖలకు సంబంధించిన అధికారులు సమావేశమైన సభకు మండలాధ్యక్షుడు జయచంద్రారెడ్డి అధ్యక్షత వహించారు. సమావేశంలో తహసీల్దారు మాట్లాడుతూ కొత్తగా 18 చౌక దుకాణాలకు నోటిఫికేషన్ వదిలామని, మిగతావి కూడా భర్తీ చేస్తామని తెలిపారు. ఎంఈవో రవిశంకర్ మాట్లాడుతూ పాఠశాలల ప్రహరీలు, లెట్రిన్లకు నిధులు మంజూరయ్యాయని, వాటి నిర్మాణ ప నులు చేపట్టి పూర్తి చేస్తామని తెలిపారు. విద్యుత్తు శాఖ ఏఈ వీరా రెడ్డి మాట్లాడుతూ ప్రధానమంత్రి సూర్యయోజన కింద సబ్సిడీతో సో లార్ సిస్టంలు మంజూరుకు సబ్సిడీ నిధులు వచ్చాయని, కావాల్సిన వారు సంప్రదించాలని కోరారు. వ్యవసాయాధికారి అమర్‌నాథ్‌రెడ్డి మాట్లాడుతూ రబీ సీజన్‌కు సంబంధించి జనవరి 15 వరకు ఆరుత డి పంటలకు బీమా చేసుకోవచ్చునని, సబ్సిడీపై మందులు పిచికారీ యంత్రాలను 90 శాతం సబ్సిడీతో ఇస్తున్నట్లు చెప్పారు. ఉపాధి హా మీ పథకం అధికారి వసంతకుమార్ మాట్లాడుతూ 50 మంది కూలీ లకు ఒక మేట్‌ను నియమిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎం పీడీవో రామకృష్ణయ్య,అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఫిర్యాదులపై డీఎల్‌పీవో విచారణ


విచారణ చేస్తున్న డీఎల్‌పీవో తిమ్మక్క

ప్రొద్దుటూరు రూరల్, జనవరి 6 (ఆంధ్రజ్యో తి): నిబంధనలకు వి రుద్ధంగా అక్రమాలకు పాల్పడుతూ పంచా యతీల ఆదాయానికి గండి కొడుతున్నారని అందిన ఫిర్యాదులపై జమ్మలమడుగు డీఎల్‌పీవో తిమ్మక్క విచారణ చేపట్టారు. సోమ వారం ఆమె మండల పరిధిలోని ఖాదర్‌బాద్‌లో ఉన్న గ్రామ సచి వాలయంలో ఫిర్యాదుదారులను పిలిపించి వివరాలను సేకరించా రు. ఫిర్యాదుదారుడు టీడీపీ బీసీసెల్ రాష్ట్ర కార్యదర్శి సుంకర వేణు గోపాల్ కొత్తపల్లె పంచాయతీలో చోటు చేసుకుంటున్న ఆక్రమణలు, అక్రమాలపై కలెక్టర్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. వీటిపై ఆయన డీపీవో, డీఎ ల్‌పీవో, ఈవోఆర్‌డీలకు కూడా ఫిర్యాదు చేసినట్లు వివరించారు. ఈ నేపథ్యంలో డీఎల్‌పీవో తిమ్మక్క కొత్తపల్లె పంచాయతీ కార్యాలయం లో చేపట్టిన విచారణలో భాగంగా ఆయన హాజరై వివరాలను అం దజేశారు. ఈ సందర్భంగా డీఎల్‌పీవో తిమ్మక్క మాట్లాడుతూ ఫి ర్యాదు దారుల నుంచి వివరాలు సేకరించామని, క్షేత్రస్థాయిలో పరి శీలన జరిపి ఆక్రమణలు, అక్రమాలకు పాల్పడినవారిపై చర్యలు తీ సుకుంటామని పేర్కొన్నారు. ఈ విచారణలో ఈవోపీఆర్‌డీ రామాం జనేయులరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కార్యదర్శుల అధ్యక్షుడిగా సుధాకర్‌బాబు

అట్లూరు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): అట్లూరు మండల పంచాయతీ కార్యదర్శుల అధ్యక్షుడిగా సుధాకర్‌బాబు, ఉపాధ్యక్షుడుగా ఆనంద రావును పంచాయతీ కార్యదర్శుల కార్యవర్గసభ్యులు ఎంపీడీవో కార్యాలయంలో ఏకగ్రీవంగా సోమవారం ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో సుధాకర్‌బాబు మాట్లాడుతూ కార్యదర్శుల హక్కులపై పోరాడుతానని తెలిపారు.

పల్లాకు తెగులుతో దెబ్బతిన్న మినుము


పల్లాకు తెగులుతో నల్లగా మారిన మినుము

చాపాడు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): రబీ సీజన్‌లో సాగు చేసిన మి నుము పైరుకు పల్లాకు తెగులు సోకడంతో దెబ్బతిందని రైతులు తెలిపారు. నెలన్నర క్రితం మినుమును సాగు చేశారు. వెదురూరు, తిప్పిరెడ్డిపల్లె, నరహరిపురం, విశ్వనాథపురం, బసిరెడ్డిపల్లె, పీవోప ల్లె, చిన్నగురవలూరు గ్రామాల పరిధిలో సుమారు 200 ఎకరాల్లో సాగు చేశారు. ప్రస్తుతం పైరు పిందె దశలో ఉంది. పల్లాకు తెగు లు సోకడంతో పైరు అంతా నల్లగా మారింది. మొత్తం సాగు చేసి న పైరు ఎందుకు పనికిరాకుండా పోయిందని రైతులు వాపోతున్నా రు. ఇక ఈ పైరు పనికిరాదని వారు దిగాలు చెందుతున్నారు. ఎక రాకు సాగు చేసినందుకు సుమారు రూ.10 వేలు ఖర్చు అయిందని తెలిపారు. ఈ తెగుళ్ల నివారణకు పురుగు మందులు పిచికారీ చేసి నప్పటికీ నివారణ కాలేదన్నారు. కొన్ని నెలలుగా భూమిని బీడుగా పెట్టి మినుమును సాగు చేసినప్పటికీ దెబ్బతిందన్నారు. వాతావర ణంలో మార్పు జరగడంతో మినుముకు తెగుళ్లు సోకిందని చెప్పా రు. పైరు సాగుకు పెట్టిన పెట్టుబడి వృథా అయిందని వారు ఆవే దన వ్యక్తం చేస్తున్నారు.

టమోటా రైతు కుదేలు..!

దళారుల చేతిలో దగాపడుతున్న వైనం



మైదుకూరు రూరల్,జనవ రి 6(ఆంధ్రజ్యోతి) : పెట్టుబడి పెట్టి ఎవరైనా,ఏ వ్యాపారం అయిన చేయవచ్చు. కాని పంటలు పండించాలంటే ఒక్క రైతు మాత్రమే చేయగలడు. అలాంటి రైతులు నేడు పంటలు పండించి పెట్టుబడుల కోసం ఎదురు చూస్తుండటం చాలా బాధాకర విషయం. ఈ సారి రైతులు అకాల వర్షాలతో కుదేలయ్యారు. టమోటా రైతులు ఒక్క ఎకరంలో పంటను పండిచాలంటే పెట్టిబడికి సుమారు యాభై వేల నుంచి ఎనభై వేల రూపాయల ఖర్చు అవుతోందని చెబుతున్నారు. ఒక్కసారి పంట వేస్తే సుమారు 6 నుంచి 8 వరకు కోతలు వస్తాయి.టమోటాలను బాక్స్‌ల ప్రకారం రైతుల వద్ద వ్యాపారులు కొంటారు.ఒక బాక్స్‌లో సుమారు 30 కేజీల వరకు టమోటా లు ఉంటాయి.కాగా ఈ యేడు టమోటా బాక్స్‌ను దళారులు కేవలం 60 రూపాయల నుంచి 80 రూపాయల వరకు ధర నిర్ణయించి కొంటున్నారు. దీంతో రైతులు పెట్టుబడులటుంచి, కోతలు కోసే కూలీల ఖర్చు కూడా ఇవ్వలేనంతగా నష్టపోతున్నారు.పొలంలో పంటను కోయలేక,అలానే ఉంచలేక చాలా ఇబ్బంది పడుతున్నారు.దీనికి తోడు అకాల వర్షాలతో పంట చాలా వరకు తెగులు పట్టి పోతుండటంతో దిగుబడి పూర్తిగా తగ్గింది.దీంతో టమోటా రైతులు చాలా వరకు నష్టాలబారిన పడుతున్నారు. దళారులు రైతుల వద్ద టమోటా కేజీ రెండు రూపాయలకు కొంటే,బయట మార్కెట్‌లో 20 రూపాయలు అమ్ముతున్నారు.రైతులకు గిట్టుబాటు ధర లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

రికార్డులు లేకుంటే చర్యలు

ఖాజీపేట, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): మం డల పరిధిలోని ఎరువులు, మందుల దు కాణాదారులు రికార్డులు సరిగా నిర్వహిం చకుంటే చర్యలు తప్పవని కమలాపురం ఏడీఏ నరసింహారెడ్డి అన్నారు. సోమవా రం ఎరువుల దుకాణాలను తనిఖీ చేశా రు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారి నాగార్జున, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళ అప్పగింత

పోరుమామిళ్ల, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ఇంటి నుంచి వెళ్లిపోయిన మహిళను ఎస్‌ఐ కొండారెడ్డి తిరిగి వారి కుటుంబ సభ్యులకు అప్పజెప్పారు. ఎస్‌ఐ వివరాల మేరకు.. మండలంలోని చల్లగిరిగెల హరిజనవాడకు చెందిన కావ్య అనే మహిళ గత నెల 23న పోరుమామిళ్లకు ఆటోలో వెళ్లి తిరిగి రాలేదని, ఆమె భర్త మల్లికార్జున అదే నెల 28న ఫిర్యాదు చేశారు. ఆయన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ దర్యాప్తు చేసి ఆమె హైదరాబాదులో ఉన్నట్లు ఆచూకీ తెలుసుకుని సోమవారం వారి కుటుంబ సభ్యులకు అప్పజెప్పారు.